తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నెల్లూరు : fb.com/vaartha

PUBLISHED FROM NELLORE, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

2-4-2023 ఆదివారం సంపుటి : 29 సంచిక : 61, పేజీలు : 10+4 వెల : 8.00



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నెల్లూరు fb.com/vaartha
PUBLISHED FROM NELLORE, TIRUPATHI, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
2-4-2023 ఆదివారం సంపుటి : 29 సంచిక : 61, పేజీలు : 10+4 వెల : 8.00

రూ. 150.95 లక్షల కోట్లకు చేరిన దేశ రుణభారం

చుక్కలనంటిన పాకిస్థాన్ ద్రవ్యోల్బణం 5లో



శనివారం మండల సచివాలయ కన్వీనర్లు గ్రామ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆదిమూలపు

## 'జగనన్నే మా నమ్మకం.. మా ధైర్యం'

### 7 నుంచి 15 దాకా వినూత్న కార్యక్రమం: మంత్రి ఆదిమూలపు

**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని తన బాధ్యతగా తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నినాదం జగనన్నే మా ధైర్యం ప్రతి ఇంటికి వెళ్లేలా సచివాలయ కన్వీనర్లు గృహసారధులు చూడాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పెద్దారవీడు మండల కేంద్రంలోని దేవరాజుగట్టు గ్రామంలో శనివారం మండల సచివాలయ కన్వీనర్లు గ్రామ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షకు సచివాలయ కన్వీనర్ ఏరువ వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాలిరెడ్డి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని మాట్లాడారు. జగనన్నే మా నమ్మకం మా ≫2

# సంక్షేమానికి లోటు రానివ్వం

## నాడు, నేడు పనులకు నిధుల కొరత రాకుండా చర్యలు

### రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు త్వరగా పూర్తి చేయాలని సిఎం జగన్ ఆదేశం



**విజయవాడ,ఏప్రిల్1 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి లోటు పాట్లు ఉండకూడదని సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న ఏ లబ్ధిదారుని సంక్షేమం అందలేదని మాట రాకూడదన్నారు. గడప, గడపకు గుర్తించిన సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సిఎం జగన్ ఆదేశించారు. ఈ విషయంలో ఎటువంటి ఉపేక్షలకు తావివ్వకూడదని సిఎం జగన్ ఆదేశించారు. నవరత్న పథకాల సోషల్ ఆడిట్ సమయంలోనే అర్హులైన వారి పేర్లు రాలేదని గుర్తించిన వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అయినప్పటికి ఏవరైనా అర్హులు మిగిలిపోతే పథకం అమలు చేసిన తేది నుంచి నెల రోజుల పాటు వారు దరఖాస్తును చేసుకునే అవకాశం ఇవ్వాలన్నారు. తరువాత నెలల్లో వెరిఫికేషన్ చేయాలన్నారు. వాటిని వెంటనే పరిష్కరించి, మూడు నెలల్లో వారికి నిధుల విడుదల చేయాలన్నారు. అప్పటితో ఆ స్కీం సంపూర్ణంగా ముగిసినట్లు అవుతుందన్నారు. దరఖాస్తు చేసిన 90 రోజుల్లో ఇంటి పట్టా అందాలన్నారు. నిర్ణీత సమయంలోగా ఇంటి పట్టా అందించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. దరఖాస్తు చేసిన 90 రోజుల్లోగా ఇంటి పట్టా అందించాలన్నారు. ఇది ప్రభుత్వ కృత నిశ్చయంగా వెల్లడించారు. ఈ విషయంలో అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలన్నారు. పట్టణాల్లో తక్కువ ధరలకు సామాన్య మధ్యతరగతి వర్గాలకు ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఇందుకోసం పట్టణాలు నగరాల్లో 100 నుంచి 150 ఎకరాల స్థలం సేకరించాలన్నారు.
ఒకే కుటుంబానికి ఒక ప్లాటు వంతున ఎంఐజీ-1లో 150 గజాలు. ఎంఐజీ-2లో 200 గజాలు, ఎంఐజీ-3లో 240గజాలు కేటాయించడం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయాలు, కాల్ సెంటర్లు, వెబ్ అప్లికేషన్, మొబైల్ యాప్, ప్రజా దర్బార్లు ద్వారాగాని వినతులు ఇచ్చే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వెబ్‌లింకు ద్వారా 1902 కాల్‌చేసి లేని పక్షంలో గ్రామ సచివాలయాల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. నవరత్నాల్లో ప్రతి పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. నవరత్న పథకాల సోషల్ ఆడిట్ సమయంలోనే అర్హులైన వారి పేర్లు రాలేదని గుర్తించిన వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అయినప్పటికి ఏవరైనా అర్హులు మిగిలిపోతే పథకం అమలు చేసిన తేది నుంచి నెల రోజులపాటు వారు దరఖాస్తును చేసుకునే అవకాశం ఇవ్వాలన్నారు. తరువాత నెలల్లో వెరిఫికేషన్ చేయాలన్నారు. వాటిని వెంటనే పరిష్కరించి, మూడు నెలల్లో వారికి నిధుల విడుదల చేయాలన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇళ్ల నిర్మాణం ఒక నిరంతర ప్రక్రియగా జరగాలన్నారు. నాడు, నేడు పనులకు సంబంధించి నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యంలోగా పనులు పూర్తయ్యేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.
భూసేకరణలో గాని, ఇతరత్రా ఏ విష ≫2

# రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

## ఒంటిపూట బడులుకూడా రేపటి నుంచి..

### బిజెపి నాయకుడు సత్యకుమార్‌పై దాడికి మాకు సంబంధమేమిటీ: మంత్రి బొత్స



**విజయవాడ, ఏప్రిల్1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 10వ తరగతి పరీక్షలు రేపటినుంచి ప్రారంభం అవుతున్నాయి, అదే రోజునుంచి పాఠశాలలకు ఒంటి పూట తరగతులు ఆరంభమవుతున్నాయి. విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం మీడియాకు ఈ విషయాన్ని తెలియజేసారు. పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేసారు. టెన్త్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3449 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. రాష్ట్రంలో 6.69లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. ఉదయం 9.30గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షా సమయం ఉంటుందన్నారు. ఆరు పాఠ్యాంశాలకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఉదయం 9గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్ధులను అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాల్లోని సెల్‌ఫోన్లకు అనుమతిలేదన్నారు. ప్రభుత్వ టీచర్లను మాత్రమే ఇన్విజిలేటర్లుగా ఉంటారన్నారు. 10వ తరగతి విద్యార్ధులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలవద్ద నో మొబైల్‌జోన్‌గా ప్రకటించామన్నారు. సెల్‌ఫోన్, స్మార్ట్ పరికరాలు మొదలైనవి ఇన్విజిలేటర్లు కుడా తీసుకుని రాకూడదన్నారు. పరీక్షలు జరిగే రోజున పరీక్షా కేంద్రాల పరిధిలోని ఆయా పాఠశాలలకి సెలవు ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణకి 800ల స్క్వాడ్‌లు ఏర్పాటు చేసామన్నారు, పదవ తరగతి పరీక్షా వేసవి కాలం నేపథ్యంలో ఈనెల 3నుంచి ఒంటి పూట బడులు ప్రారంభమగుతాయని తెలిపారు. రాజకీయాంశాలపై మంత్రి బొత్స మాట్లాడుతూ అమరావతి ఉద్యమం ప్రజా ఉద్యమం కాదన్నారు. అమరావతి ఉద్యమానికి స్ఫూర్తి ఏమీటన్నారు. టెంట్లు వేసుకోవడమా? అని ప్రశ్నించారు. అక్కడ ఉన్నది రైతులు కాదన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు అండ్ కో అంటూ కీలక వ్యాఖ్యలు చేసారన్నారు. సత్యకుమార్‌పై దాడితో మాకేం అవసరమన్నారు. రాజకీయంగా మాపై బురద చల్లడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు అండ్ కో ల్యాంగ్ పూలింగ్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసారన్నారు. రూ.లక్షల కోట్లు ఒకే ప్రాంతంలో పెట్టాలా? అని ప్రశ్నించారు. అమరావతి గురించి మాట్లాడుతూ అక్కడ చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏముందన్నారు. అక్కడ చేసిన గుంతల్లో మట్టి పోయాలా? అని ప్రశ్నించారు. ఊరంటే స్మశానం కుడా ఉంటుందన్నారు. అందుకే గతంలో ఆ మాట అన్నానన్నారు. మూడు రాజధానులకు, విశాఖను కార్యనిర్వాహక రాజధానిగావద్దని అక్కడి ≫2



## 24 గంటల్లో 2994 కొత్త కేసులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** భారత్‌లో కొవిడ్ కేసుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. వైరస్ వ్యాప్తి ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో వేగంగా సాగుతోంది. గత 24 గంటల్లోనే 2994 కేసులు నమోదయ్యాయి. వీటితో కలుపుకుని దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 16,354కు చేరుకుంది. ఈ సంఖ్య ఇప్పుడు దేశంలో అన్ని రాష్ట్రాల్ని కలవరపెడుతోంది. ఇదే తీరుగా కేసుల సంఖ్య పెరిగితే గతంలో కొవిడ్ రెండోవేవ్ తరహా పరిస్థితులు తప్పవనే భయాలు నెలకొంటున్నాయి. దేశంలో మొత్తం తొమ్మిదిమంది చనిపోయారు. దీనితో మొత్తం మరణాలు 5,30,.876కి పెరిగాయి. ఢిల్లీ, కర్ణాటక పంజాబ్‌లలో ఇద్దరేసి చనిపోయారు. గుజరాత్‌లో ఒకరు, కేరళలో ఇద్దరుచనిపోయినట్లు వెల్లడయింది. క్రియాశీలకేసులు మొత్తంబాధితుల్లో0.04 శాతంగా ఉందనితేలింది. భారత్‌లో ప్రస్తుతం కొవిడ్‌రోగులు 4.47 కోట్లకు పైబడి ≫2

## జగన్‌కు ఎందుకు దూరమో త్వరలోనే చెబుతా..

### కాంగ్రెస్ సీనియర్ నేత కెవిపి



**విజయవాడ,ఏప్రిల్1, ప్రభాతవార్తప్రతినిధి:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికి దగ్గరగా ఉన్న తాను సిఎం జగన్‌కు ఎందుకు దూరంగా ఉంటున్నాననే అంశంపై ఇప్పుడు సమాధానం చెప్పనని కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నేత కెవిపి రామచంద్రరావు తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ జగన్‌తో తాను దగ్గరగా లేననే ప్రశ్నలకు సంబంధించి ఎంతో కాలం దూరం జరగలేనన్నారు. ఏదో ఒక రోజు సమాధానం చెప్పాల్సిందేనన్నారు. ఒక రోజున ఇందుకు సంబంధించిన అన్ని ప్రశ్నలకు ప్రెస్‌మీట్ పెట్టి అన్నింటికి సమాధాన వివరణాత్మకంగా అందిస్తానన్నారు. అదాని సంపద గురించి రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తే, దేశ ద్రోహమా అని నిలదీసారు. ఆయనను పార్లమెంటు సభ్యత్వానికి అనర్హుడుని చేస్తే, ఒక్క ఎపిలో రాజకీయ ప్రధాన రాజకీయ పక్ష నాయ కులు తప్ప అంతా విమర్శించారన్నారు. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ కేంద్ర విధానాలకు వ్యతిరేకంగాచేసే పోరాట కార్యక్రమాలను అణచివేయవద్దని సీఎం జగన్ విజ్ఞప్తి చేసారు.
జాతీయ రాజకీయాల్లో తాను కీలకమని చెప్పుకునే చంద్ర బాబు రాహుల్ విషయంలో ఎందుకు మాట్లాడలేదన్నారు. ఎపిలో మురికి కాల్వల్లో అవినీతి గురించి మాట్లాడానికి చంద్రబాబు ఎందుకు పరిమితమయ్యారన్నారు. పోలవరం ప్రాజెక్టులో చంద్రబాబు చేసిందేమిటీ దివంగత నేత రాజశేఖర రెడ్డి తవ్వించిన కాల్వల్లో, ఆయన ప్రతిపాదిత పథకాలతో నీళ్ల విడుదల చేయడమా; అన్నారు. చంద్రబాబుది అవకాశవాద రాజకీయమ న్నారు. ప్రశ్నించడమే తన పార్టీ లక్ష్యం అని చెప్పుకునే పవన్ కల్యాణ్ రాహుల్ విషయంలో ఎందుకు మౌనం వహించారన్నారు.




రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

## అప్పర్ భద్రతో ఎపికి తీవ్ర నష్టం

### రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి ప్రభుత్వం

### ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికి వదిలేసిన సిఎం జగన్

### రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**అనంతపురం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త బ్యూరో:** కర్ణాటక రాష్ట్రంలో అప్పర్ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఎపిలో రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు జీవనాడి అయిన పోలవరం జాతీయ ప్రాజెక్టును పూర్తి నీటి సామర్థ్యంతో నిర్మించాలని కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును ఆపాలని జిల్లా కేంద్రంలోని కమ్మభవన్‌లో అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ జిల్లాకార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, సీనియర్ నాయకుడు ఎంవి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయ కులు దాదా గాంధీ, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటమయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. కర్ణాటక ఎన్నికల లబ్ధికోసమే అప్పర్ భద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అక్రమంగా నిర్మిస్తున్నారని ఏకరువు పెట్టారు. ప్రాజెక్టు నిర్మాణానికి సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతులు ≫2



## 3వ నెలలోనూ హుండీ ఆదాయం రూ. 120 కోట్లు

### భారీగా పెరిగిన శ్రీవారి భక్తులు

**తిరుమల, ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** గత ఏడాది కాలంగా వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యతో బాటు కానుకల రూపంలో హుండీ ఆదాయం కూడా అనూహ్యంగా అంచనాలకు మించింది. 2023 నూతన ఆంగ్ల సంవత్సరంలోనూ వెంకన్న దర్శనార్థం వస్తున్న భక్తుల సంఖ్యను గమనిస్తే గణాంకాలు మాత్రం భక్తుల సంఖ్యతోబాటు వెంకన్న హుండీ ఆదాయం కూడా భారీగా రెట్టింపయింది. 2023 జనవరినెలలో 20.78 లక్షల మంది భక్తులకు వెంకన్న దర్శనం చేయించగా కానుకల రూపంలో హుండీ ఆదాయం 123.07కోట్లు రూపాయలు చేకూరింది. ఫిబ్రవరి నెలలో 28 రోజులకు గాను 18.42 లక్షలమంది భక్తులు తిరుమలేశుని దర్శించుకోగా హుండీకి ఆదాయం 114.29 కోట్లు రికార్డుస్థాయిలోలభించింది. ఇక తాజాగా మార్చినెలకు సంబంధించి 20.55 లక్షల మంది భక్తులు వడ్డీకాసుల వాడిని దర్శించుకున్నారు. ఈ భక్తులు సమ ≫2

# టిడిపి, వైఎస్సార్సీ బాహాబాహీ

## పుట్టపర్తిలో ఉద్రిక్తత

### ఇరువర్గాల వాహనాలు ధ్వంసం

### రాళ్లు, చెప్పులు విసురుకున్న వైనం

**పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక క్షేత్రమైన పుట్టపర్తి తొలిసారిగా దాడులు, ప్రతిదాడులకు కేంద్రబిందువుగా మారింది. టిడిపి, వైఎస్సార్సీ వర్గాల మధ్య పరస్పర దాడులతో శనివారం సత్యమ్మ దేవాలయం సర్కిల్ ప్రాంతంలో ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా గత మార్చి నెల 25వ తేదిన పుట్టపర్తి నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్ర నందు నారాలోకేష్ స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిపై చేసిన విమర్శలకు ప్రతిగా స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సత్యమ్మ దేవాలయం వద్ద ప్రమాణానికి సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ఈ సవాలును స్వీకరించిన టిడిపి మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మరియు టిడిపి శ్రేణులు సోషల్ మీడియాను కేంద్రంగా చేసుకొని సవాలుకు సై అంటే సై అంటూ పరస్పరం రెచ్చగొట్టుకునేలా పోస్టులు పెట్టుకున్నారు.
ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1వ తేదిన పుట్టపర్తిలోని సత్యమ్మ దేవాలయం వద్దకు ప్రమాణానికి రావాలని అటు టిడిపి శ్రేణులు, ఇటు వైఎస్సార్సీ శ్రేణులు సంసిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో పుట్ట పర్తి ప్రశస్తాన్ని దృష్టిలో ఉంచుకొని ఇటువంటి వాటికి ఎలాంటి అనుమతులు ఇవ్వడం జరగదని ముందస్తుగా పోలీసులు ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తన అనుచరులతో కలసి టిడిపి కార్యాలయం మీదుగా కేకలు, ఈలలు వేసుకుంటూ పట్టణంలోని సత్యమ్మ దేవాలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉన్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సత్యమ్మ దేవాలయం వద్దకు వెళ్లడానికి ప్రయత్నించగా బయట ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి నుండి ఎలాగో అలా తప్పించుకున్న పల్లె రఘునాథ్ రెడ్డి సత్యమ్మ దేవాలయం వద్దకు వచ్చి రచ్చకు రావాలని పిలుపునిచ్చారు. ఆంజనేయ స్వామి దేవాలయంలో ≫2



మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిని బలవంతంగా తీసుకెళుతున్న పోలీసులు



## జైలు నుంచి ముందే విడుదలైన సిద్దూ

### రాహుల్ గాంధీ ఓ విప్లవమని వ్యాఖ్య

**చండీగఢ్, ఏప్రిల్ 1:** టీమిండియా మాజీ క్రికెటర్, కాంగ్రెస్ పంజాబ్ నేత నవజ్యోత్‌సింగ్ సిద్దూ పది నెలల జైలు శిక్ష అనంతరం శనివారం విడుదలయ్యారు. 34 యేళ్ల కిందటి ఓ కేసులో గతేడాది సిద్దూకు జైలుశిక్ష పడింది. శిక్ష పూర్తి కావడంతో పాటియాలా జైలు నుంచి విడుదలయ్యారు. భారీ సంఖ్యలో తరలి వచ్చిన ఆయన అభిమానులు జైలు బయట ఘనస్వాగతం పలికారు. వాస్తవానికి ఆయనకు యేడాదిపాటు శిక్ష పడింది. ఆ లెక్కన ఆయన మే ≫2

# అన్నదాతను ముంచిన అకాల వర్షాలు

సిహెచ్ వి వి రఘుబాబు

అన్నదాతలపై పగబట్టినట్లుగా పర్యావరణ విధ్వంసంతో దేశంతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా విపరీత వాతావరణ పోకడలు కన్పిస్తున్నాయి. అకాల వర్షాలు లేకుంటే వర్షాభావ పరిస్థితులు పట్టిపీడిస్తున్నాయి. కాలం అయినా, కరవు అయినా కాని రైతులకు మిగిలేది కష్టాలు, కన్నీళ్లు, అప్పులే. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు, దేశవ్యాప్తంగా వివిధరాష్ట్రాల్లో అకాల వర్షాలు, వడగళ్ల వానలు, వాటికి తోడు ఈదురు గాలులు రైతుల ఆశలపై నీళ్లుచల్లాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాలవర్షాలు రైతాంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు ఆగమాగం అవుతున్నాయి. లక్షలాది ఎకరాల్లో వరి, గోధుమ, మొక్కజొన్న, మినుము, జొన్న, మామిడి, బొప్పాయి తదితర పంటలు ఈ వర్షాలకు దెబ్బతిన్నాయి. ప్రస్తుత వర్షాలతో దేశంలో మామిడి పంట 20 శాతం వరకూ దెబ్బతిన్నట్లు ఐసీఏ ఆర్ అంచనా. ఉత్తర భారతంలో వడగళ్ల వాన, ఉరుములతో కూడిన వర్షం కారణంగా భారీ నష్టం వాటిల్లింది. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి కూడా రానిపరిస్థితిలో అన్నదాతలు కుదేలవుతున్నారు. ప్రకృతి విపత్తులు, అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతాంగం కుదేలవుతుంటే వారిని ఆదుకునే పథకం ఏదీకూడా ప్రభుత్వం వద్ద లేకపోవడం అత్యంత దారుణం. అయితే తెలం గాణలో పంటలబీమా అమలు చేయకపోయినా, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వివిధ జిల్లాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరి శీలించి కౌలురైతులతో సహా ఎకరానికి 10వేల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతో దెబ్బతిన్న పంటలకు పరిహారం లభించనుంది. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని అందించనున్నారు. దీనికి సంబంధించి పంట నష్టాలపై ఎన్యూమరేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు.

గత కొన్ని రోజుల నుండి అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురు గాలులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, ఉత్తర భారతంలోనూ రైతాంగానికి తీరని నష్టాలను మిగిల్చాయి. ఇవి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఆహార ధాన్యాలు, ఉద్యానవన పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. తెలంగాణలో దాదాపు 4.10లక్షల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతినగా, ఆంధ్రప్రదేశ్‌లో 2.50లక్షల ఎకరాల్లో నీటి పాలయ్యాయి. సాధారణంగా రబీ (యాసంగి) సీజనులో ఈదురు గాలులు, అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయి. అధికారులు మాత్రం తెలంగాణలో 2,22,250 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అంచనావేశారు. తెలంగాణలోని భూపాపల్లి, గద్వాల, సంగారెడ్డి, రంగారెడ్డి, కొత్తగూడెం, నల్లగొండ, కొత్తగూడెం, నాగరకర్నూల్, మెదక్, ఖమ్మం, తదితర జిల్లాల్లో వివిధ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా దాదాపు 6 లక్షల ఎకరాల్లోని వరి, మిర్చి, మామిడి, మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ, పప్పుశెనగ, నిమ్మ, బొప్పాయి, ఉల్లి, టమాటా, బీరకాయ వంటి కూరగాయలు తదితర పంటలు దెబ్బతిన్నట్లు అంచనా. కల్లాలు, పొలాలు, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆరుబయట ఆరబెట్టిన ఎండు మిర్చి, మొక్కజొన్న, వేరుశెనగ, పప్పుశనగ తడిసి ముద్దయ్యాయి. మామిడి చెట్లు విరిగిపడగా, పిందెలు, కాయలు రాలిపోయాయి. పొట్టదశలో ఉన్న వరి, మొక్కజొన్న చేలు నేలవాలాయి. కొత్తగూడెం జిల్లాలో గోదావరి వెంట కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట అంతా నీటిపాలయ్యాయి. రోళ్లగడ్డ, చింతలపాడు, లక్ష్మీపురం, నర్సాపురం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లోని మొక్కజొన్న నేలకొరిగింది. చంద్రుగొండ, దమ్మపేట్, అశ్వారావుపేట్, ఇల్లెందు ప్రాంతాల్లో మామిడి తోటలు ధ్వసం అయ్యాయి. చెట్లకొమ్మలు విరిగి పడ్డాయి, మామిడి పిందెలు, కాయలు రాలిపోయాయి. భూపాలపల్లి జిల్లాలోని కసింపల్లి తదితర ప్రాంతాల్లో కల్లాల్లో ఎండబోసిన మిర్చి పూర్తిగా నీట కొట్టుకుపోయింది. గద్వాల జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అమ్మకానికి ఉంచిన వేరుశెనగ సంచులు తడిసిపోయాయి. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి తెచ్చిన పప్పుశెనగ, ధాన్యం బస్తాలు నీటిమునిగాయి. మానవపాడు మండలంలో మిర్చి రైతులు ఆగమాగం అయ్యారు. నాగర్ కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం మహదేవునిపేట్ పరిధిలోని కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న పూర్తిగా తడిసిపోయాయి. హైదరాబాద్ నగరానికి నిత్యం కూరగాలు సరఫరా చేసే సంగారెడ్డి, వికారాబాద్, మెదక్ తదితర జిల్లాల్లోని పంటలు దెబ్బతిని అన్నదాతలకు అపార నష్టం మిగిల్చింది. సంగారెడ్డి జిల్లాలో వడగండ్ల వానభీభత్సం సృష్టించడంతో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఈ జిల్లాల్లో దాదాపు 1,500 ఎకరాల్లో ఉల్లి, 700 ఎకరాల్లో కూరగాయలు, 350 ఎకరాల్లో మామిడి,



50 ఎకరాల్లో బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. వీటితో పాటు, వరి, మిర్చి, పుచ్చ, నిమ్మ, బత్తాయి, నిమ్మ తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని జహీరాబాద్, కోహీర్, రాయికోడ్, న్యాల్‌కల్, మునిపల్లి, వట్‌పల్లి తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, శెనగ, చెరుకు పంటలు దెబ్బతిన్నాయి. వికారాబాద్ జిల్లాలో 1,200 ఎకరాల్లో ఉల్లి పంట పూర్తిగా దెబ్బతినగా, 70శాతం మేర కూరగాయల తోటలకు నష్టం వాటిల్లింది. నాలుగు రోజుల్లో కోతకు రానున్న తర్బూజ పంట వడగండ్ల వానతో మొత్తం ధ్వంసమైంది. రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో వడగండ్ల వాన, భారీ వర్షాలతో మిర్చి పంటలు, ఆరబెట్టిన మిరపకాయలు నీటిపాలయ్యాయి. మామిడి కాయలు రాలిపోగా, చెట్లు విరిగిపడ్డాయి. గద్వాల జిల్లాలో దంచి కొట్టిన వర్షం, వడగండ్ల వానలతో వ్యవసాయ మార్కెట్ యార్డులో దాదాపు 140క్వింటాళ్ల వరకూ వేరుశెనగ కొట్టుకు పోయింది. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని పప్పు శెనగలు తడిసిపోయాయి. మల్లకల్ మానవపాడు అంలంపూర్ మండలాల్లోని రైతులు తమ కల్లాల దగ్గర ఎండబెట్టిన ఎండుమిర్చి పూర్తిగాతడిసిపోయింది. బిజినేపల్లి మండలం మహదేవునిపేట్ గ్రామంలో వర్షాలతో ఆరుబయట ఆరబెట్టిన మక్కలు, ధాన్యం మొత్తం నీటిపాలయ్యాయి. గద్వాల జిల్లాలో పొగాకు దోరణాలు వానకు తడిసిముద్దయ్యాయి. వికారాబాద్ జిల్లాలోని మోమిన్‌పేట్ మండలంలో 600ఎకరాల్లో కూరగాయ పంటలు, వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న, వరిపంటలు దెబ్బతిన్నాయి. మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల్లో మామిడి చెట్లు నేలకొరిగాయి, అలాగే ఉల్లి, బొప్పాయి వంటి ఉద్యానపంటలు, మొక్కజొన్న చేలకు నష్టం వాటిల్లింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన అన్నదాతల కష్టాన్ని అకాల వర్షాలు తుడిచిపెట్టేశాయి. రాష్ట్రంలోని 16జిల్లాల్లో వర్షాలు, వడగళ్ల వానలు తీవ్ర ప్రభావం చూపాయి. దాదాపు 2.50లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిందని, మొత్తంగా 450 కోట్ల రూపాయలకు పైనే రైతులు నష్టపోయారు. మొక్కజొన్న పంట భారీగా దెబ్బతింది. కొన్ని జిల్లాల్లో ఖరీఫ్ సీజన్‌లో నూర్చిన ధాన్యం వానలకు తడిసిపోగా, రబీలో సాగుచేసిన వరి చేతికందేదశలో వర్షం కురవడంతో గింజ రాలిపోతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో తోట్లవల్లూరు, ఉంగుటూరు, గూడూరు తదితర మండలాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. రంగు మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక రబీలో వేసిన వరి, జొన్న, మొక్కజొన్న చేలు పడిపోయాయి. సుమారు 50వేల ఎకరాల్లో రెండో పంటగా వేసిన మినుము పనలపై ఉండగా తడిసింది. ఎకరానికి దాదాపు 13వేల రూపాయల వరకూ నష్టంవస్తుంది. ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి తదితర మండలాల్లో వర్జీనియా పొగాకు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొక్కజొన్న, జొన్న పాలు పోసుకునేదశలో తడిసిపోయాయి. కాకినాడ జిల్లాలో వరి, మొక్కజొన్నతో పాటు, నువ్వు చేలు నీట పాలయ్యాయి. నెల్లూరు జిల్లాలో 9 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. అనంతపురం జిల్లాలో 8,100 ఎకరాల్లో వరి, జొన్న, కొర్ర, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. ప్రకాశం జిల్లాలో పత్తి, మిరప, పొగాకు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు నష్టంవాటిల్లింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 24 వేల ఎకరాలకు పైగా పంట నీటి పాలైంది. వైఎస్సార్ అన్నమయ్యజిల్లాల్లో 3వేల ఎకరాల్లో, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొక్కజొన్న, లంక పొగాకు, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. మరోపక్క ఈ అకాల వర్షాలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పంట నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందేలా కనిపించడం లేదు. పంటనష్టం వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు మొత్తం పంటలో 33శాతం కంటే అధికంగా నష్టం జరిగితేనే పరిహారం అందుతుందని చెప్పడం గమనార్హం. అంతకంటే తక్కువ శాతం పంట దెబ్బ తింటే నష్టం వాటిల్లినా పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ క్రాప్ నమోదైన వెంటనే పంటలను అధికారులు పరిశీలిస్తున్నారు.



వివిధ కారణాలతో ఈ క్రాప్ నమోదు కాని రైతులకు పరిహారం అందే పరిస్థితి లేదు. ప్రతీ ఏటా విపత్తుల కారణంగా గాలిలో దీపా లవుతున్న రైతుల జీవితాలకు బీమా కల్పించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కేంద్రం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణలో వర్తింప చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా కాని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్నట్లు ప్రత్యేక బీమాపథకాన్ని అయినా తెలంగాణలో అమలు చేయడంద్వారా పంటలకు పరిహారం ద్వారా రైతులను ఆదుకునేవీలుంటుంది. అదేవిధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోరైతులు తక్కువ కాలపరిమితిలో చేతికి వచ్చే వంగడాలను ప్రధానంగా వరి పంటను సాగుచేయాలనేది వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటుండగా, ఆదిశగా రైతుల్లో అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ విఫలమవుతోంది. కేఎన్ఎం 118 వంటి వరి వంగడాలను యాసంగిలో సాగుచేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. 125 రోజుల్లో వరి పంట చేతికి వస్తే అకాల వర్షాలు రాక ముందే పంట కోత దశకు చేరుకుంటుంది. అయితే వీటిపై అంతగా అవగాహన లేని రైతులు రబీ పంటల నాట్లను ఆలస్యంగా నాటడంతో పాటు, దీర్ఘకాలిక రకాలను సాగు చేస్తుండటంతో అకాల వర్షాల బారిన పడుతున్నారు. ●

# కన్నడ కదనం..

ఎ.వి.వి ప్రసాద్

కర్ణాటక

వాహోరీ పోరుకు తెర లేచింది. ఇప్పుడు దేశంలో అందరిదృష్టి కర్ణాటకపైనే. గతవారం ఎన్నికల సంఘం కన్నడ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూలును ప్రకటించడంతో అన్ని పార్టీలు ఒక్కసారిగా కదనరంగంలోకి దుకాయి. అవి ఎదురు చూస్తున్నది కూడా ఇసి నుంచి రావలసిన ఆ ప్రకటన కోసమే. మే నెలలో కర్ణాటక ఎన్నికలు జరుగు తాయని బిజెపి అధిష్టానం పలు సందర్భాలలో అంటున్నప్పటికి, ప్రధాని కర్ణాటక పర్యటనలు ఇటీవల ముమ్మరం చేసినప్పటికి, కచ్చితమైన తేదీలు తెలియక పార్టీలు డోలాయమానంలో ఉన్నాయి. ఇప్పుడు ఇసి తాంబూలాలిచ్చేయడంతో ఇక తన్నుకోవలసిన అవసరం పార్టీలపై పడింది. అయితే బిజెపి తిరిగి అధికారంలోకి రాగలదా? లేక కాంగ్రెస్ అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకోగలుగుతుందా? అన్నదే ప్రధాన ప్రశ్న. ఎన్ని పార్టీలు బరిలోకి దిగినా, ప్రధానమైన పోటీ ఈ రెండు పార్టీల మధ్యనే కనిపిస్తోంది. మరో ముఖ్యమైన పార్టీ జెడి(ఎస్) కూడా ఉన్నా, దాని ప్రభావం అంతంత మాత్రమేనని పరిశీలకులు అంటున్నారు. జెడిఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామికి కూడా తిరిగి అధికారం చేపట్టాలనే కాంక్ష ఉన్నా, అందుకు ఉపయోగించే పరిస్థితులు ఆయనకు పరిమితంగానే కనిపిస్తున్నాయి. ఏదో మేజిక్ జరిగితేనే ఆయనను సిఎం పదవి వరించవచ్చు. ఏవిధంగానైనా అధికారం నిలబెట్టుకోవాలని బిజెపి ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ అందుకే తమ పోరును ఉధృతం చేశాయి. ఎవరిది గెలుపు? ఈ ప్రశ్న సమాధానం చివరికి ఓటరు తీర్పుపైనే ఆధారపడి ఉన్నా, పార్టీల తీరును బట్టి ముందుగా కొంత అంచనా వేయవచ్చు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపికి దానిని నిలబెట్టుకోవలసిన అవసరం చాలా ఉంది. ఏ కారణంగానైనా విఫలమైతే, అతి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు దక్షిణాదిని చేజార్చుకున్నట్లవుతుంది. దక్షిణాదిలో ఒక్క కర్ణాటకలోనే ఆ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. మిగిలిన నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో బిజెపి పరిస్థితి అంతంత మాత్రమే. కుదిరితే కొన్ని సీట్లు పెంచుకోగలదు కానీ హఠాత్తుగా అధికారంలోకి వచ్చే అవకాశాలు మిగిలిన నాలుగు రాష్ట్రాలలో చాలా తక్కువ. ఈ పరిస్థితిలో కర్ణాటకలో అధికారాన్ని నిలబెట్టుకోవడం ఆపార్టీకి చాలా అవసరం. దక్షిణాదిలో ఎక్కడా అధికారంలో లేకపోతే, లోక్‌సభ ఎన్నికలపై దానిప్రభావం తప్పక పడుతుందనిపిస్తుంది. బసవరాజ్ బొమ్మయ్ నాయకత్వంలోని ప్రస్తుత బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు బలంగానే వీస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.



కర్ణాటక

రిజర్వేషన్ల విధానం విషయంలో బొమ్మయ్ ప్రభుత్వం ఇటీవల తీసుకొన్న కొన్ని చర్యల ప్రభావం కూడా అసెంబ్లీ ఎన్నికలపై పడుతుందనే చెప్పాలి. 4శాతం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేయడం, లింగాయత్, వక్కళిగలకు సమానంగా పంచడం ఇటీవల చాలా వివాదాస్పదమైంది. ఒబిసి కోటాలో ముస్లింలకు లభిస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దుచేస్తూ ఓ పది రోజుల క్రితమే ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఆ నాలుగు శాతాన్ని బిజెపికి గట్టిఓటు బ్యాంకులైన లింగాయత్‌లు, వక్కళిగలకు సమానంగా పంచడంపై ప్రస్తుతం దుమారం చెలరేగుతోంది. మతప్రాతిపదికపై రిజర్వేషన్లు హేతుబద్ధం కాదనేవాదం సమంజసమే అయినా, ఎన్నికలు సమీపిస్తున్నవేళ తీసుకొన్న నిర్ణయం కావడంతో ఎన్నికలపై దాని ప్రభావం కూడా కనిపించే అవకాశం ఉంది. ముస్లింల నుంచి తీసివేసిన రిజర్వేషన్‌లను పంచడంతో వక్కళిగలకు 4 నుంచి 6 శాతానికి, లింగాయత్‌లకు 5నుంచి ఏడు శాతానికి రిజర్వేషన్లు పెరిగాయి. రాష్ట్రంలోని 224 అసెంబ్లీ సీట్లలో 100 సీట్లుపైగా లింగాయత్‌ల ప్రాబల్యం ఉండడంతో ఈ కొత్త రిజర్వేషన్ల విధానం బిజెపికి అనుకూలించ వచ్చని ఆ పార్టీనేతలు చెబు తున్నా, మిగిలిన వర్గాలలో ఉన్న అసంతృప్తి ప్రతి కూల ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. ఈ రిజర్వేషన్ల విధానాన్ని తనకు అనుకూలంగా ఉపయోగించుకొన డానికి కాంగ్రెస్ అన్ని ప్రయత్నాలు ప్రారంభించింది. తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్ల పాతవిధానాన్ని పునరుద్ధరిస్తామంటూ కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు జాతీయ అధ్యక్షుడుగా ఉన్న మల్లికార్జున ఖర్గే సొంతరాష్ట్రం కర్ణాటక కావడంతో ఇక్కడ తమ పార్టీని గెలుపించుకోవలసిన బాధ్యత ఆయనపై ఎక్కువగా ఉందనే చెప్పాలి. ఎందుకంటే ఇక్కడ కాంగ్రెస్ ఈసారి అధికారంలోకి రాలేకపోతే, సార్వత్రిక ఎన్నికలలో దాని ప్రభావం తప్పకపడుతుంది. ప్రస్తుతం దక్షిణాదిలో కాంగ్రెస్ ఎక్కడా అధికారంలోలేదు. తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రలో కూడా పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఏమాత్రమైనా అవకాశం ఉంటే అది కర్ణాటకలోనే. ఎన్నికల షెడ్యూలును ఇసి ప్రకటించడానికి ముందు కాంగ్రెస్ 124 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించడాన్ని బట్టిచూస్తే విజయంపై ఆపార్టీ ఎటువంటి ఆశలతో ఉన్నదో అర్థమవుతుంది. ప్రస్తుత అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 75సీట్లు ఉండగా, మరో ముఖ్యపార్టీ జెడిఎస్‌కు 28 మాత్రమేఉన్నాయి. ఆ పార్టీకి మైసూరు, మరికొన్ని ప్రాంతాలలో మాత్రమే ఆధిక్యత ఉండడంతో, అధికారంలోకి రావాలంటే బిజెపి, కాంగ్రెస్ కంటె చాలా ఎక్కువ కష్టపడవలసి ఉంటుంది. దేశంలో బలమైన ప్రత్యా మ్నాయంగా ఎదుగుతున్న ఆప్ కూడా కర్ణాటక బరిలోకి దిగుతుండడంతో పోటీ మరింత ఆసక్తిదాయకంగా మారుతుందనే అనిపిస్తుంది. అయితే బలా బాలాలు తేల్చుకోవాలని బరిలోకి దిగుతున్న పార్టీ బిజెపి, కాంగ్రెస్ కావడంతో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో చూడాలి. ఆ రెండు పార్టీలకు ఈ ఎన్నికలు చావో, రేవో తేల్చుకోవలసిన పరిస్థితిని తెచ్చాయనే చెప్పాలి. ●

# 'లైంగిక'ఉచ్చులో డొనాల్డ్‌ట్రంప్!

గన్ని మోహన్

అమెరికా

అమెరికా ఆవిర్భవించిన 235 సంవత్సరాల చరిత్రలో మొదటిసారి ఒక మాజీ అధ్యక్షుడు లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పైగా ఆయన ఈ కేసులో కోర్టుకు కూడా హాజరయ్యేంతగా ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు రిపబ్లికన్ నేత డొనాల్డ్‌ట్రంప్‌పై ఈ అభియోగాలు నమోదయ్యాయి. 2016 ఎన్నికల సమయంలో తనతో లైంగికవాంఛలు తీర్చుకున్న ట్రంప్ ఈ సమాచారం బయటపెట్టకుండా ఉండేందుకుగాను తనకు 1.30 లక్షల డాలర్లు చెల్లించారని ఆమె స్వీయకథనం వెలువరించడంతో ఈ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. అంతేకాకుండా పోర్న్‌స్టార్‌తో ఒప్పందం కూడా ట్రంప్‌తరపు న్యాయవాదులు చేసుకున్నారని చెప్పిన ఆమె ఈ ఒప్పందాన్ని రద్దుచేయాలని కోరుతూ రెండేళ్లక్రితమే అమెరికా కోర్టులో దావావేసింది. అధ్యక్ష పదవిలో ఉండటంతో ఆనాడు కేసు నమోదు చేసిన దర్యాప్తు సంస్థలు విచారణచేపట్టాయి. విచారణకేవలం ఆయన చేసిన చెల్లింపులపైనే జరగడం గమనార్హం. స్ట్రోమీ డేనియల్స్ అనే పోర్న్‌స్టార్ వేసిన ఈ దావా ఇపుడు ట్రంప్‌కు రానున్న అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిబంధకంగా మారుతోంది. ఈసంబంధం బయటపడకుండా ఉండేందుకే తనతో అనైతిక ఒప్పందం చేసుకున్నారని ఆమె వాదిస్తోంది. ఈకేసుకు సంబంధించి ఇపుడు ట్రంప్ లొంగిపోతారా లేకఆయన్ను అరెస్టుచేస్తారా మరే విధంగా అయినా కోర్టు విచారణతో సరిపెడతారా అన్నది తేలాల్సి ఉంది. అధ్యక్షపదవిలో ఉండగానే రిపబ్లికన్ నేతగా రెండుసార్లు అభిశంసన తీర్మానం, యుఎస్ పార్లమెంటు భవనంపై దాడిఘటన అధ్యక్ష భవనం శ్వేతసౌధంలో ఉన్నపుడు కీలకమైన పత్రాలను ధ్వంసం చేసారన్న ఆరోపణలు మాజీ అధ్యక్షుడిపై ఉన్నాయి. ఈ కేసులో ట్రంప్ స్వయంగా లొంగిపోవాలనుకుంటే వెసులుబాటును కల్పించేందుకు మన్హట్టన్ జిల్లా అటార్నీ కూడా ఆయన తరపు న్యాయవాదులతో చర్చలు జరిపింది. మాజీ అధ్యక్షుడిని అరెస్టుచేయడానికి నిర్దిష్టమైన ప్రోటోకాల్ పాటిస్తారు. ఫ్లోరిడాలోని మార్‌ఎలాగో వద్ద ఉన్న తన ఇంటినుంచి ట్రంప్ న్యూయార్క్ సిటీకోర్టుకు రావాల్సి ఉంటుంది. ఆయన ఫోటోలు, వేలిముద్రలు తీసుకుంటారు. కేసు నమోదైతే జడ్జిని ఎంపికచేస్తారు. నిందితుడి విచారణ సమయం, ప్రయాణ ఆంక్షలు, బెయిల్ వంటివి తర్వాత వెల్లడిస్తారు. అయితే ట్రంప్‌గోప్యత కాపాడేందుకు ప్రైవేటు మార్గంలోకూడా కోర్టుకు హాజరయ్యే విధంగా అనుమతించవచ్చు. నిజంగా ట్రంప్ ఈ శృంగారంలో పాల్గొన్నారా లేక ఆయన్ను బ్లాక్‌మెయిల్‌చేసేందుకు ఈ పోర్న్‌స్టార్ ఇలా ప్రకటిస్తున్నదా అన్నది ఇపుడు నిర్ధారణ కావాల్సి ఉంది.



డొనాల్డ్‌ట్రంప్

ఫుల్ డిస్‌క్లోజర్‌పేరిట ఆమె రాసుకున్న స్వీయచరిత్రలోనే ఆమె ఈ విషయాలను స్పష్టంగా పొందుపరిచింది. 2006లో నెవాడా గోల్ఫ్ కోర్స్‌లో తాము కలుసుకున్నామని అక్కడే ఇరువురూ కలిసి ఒక పోర్న్‌స్టూడియో బూత్‌లో ఫోటోలకు ఫోజులిచ్చినట్లు కూడా ఆమె చెపుతోంది. ట్రంప్‌కి 60ఏళ్ల వయసులో 27ఏళ్ల తనతో శృంగారంలో పాల్గొన్నట్లు నిస్సిగ్గుగా వెల్లడించింది. ఈ ఆరోపణలన్నింటినీ ట్రంప్ కొట్టిపారేసారు. డెమొక్రాట్లు తనను అడ్డుకునేందుకే ఈ విధమైన దాడికి దిగారని, 2024 అధ్యక్ష ఎన్నికల్లో తనకు గెలుపు ఖాయం అన్న సమాచారంతోనే డెమొక్రాట్లు తనను అప్రతిష్టపాలుచేసి తద్వారా రాజకీయ లబ్ధిపొందేందుకు ఇలాంటి కార్యాచరణలకు దిగుతున్నారని కూడా ఆయన వెల్లడించారు. అయితే ఏది ఎలాఉన్నా ఇపుడు న్యాయస్థానమే ఆయన అభియోగాలపై విచారణ చేస్తున్నపుడు ఆయన ఇపుడు స్వయంగా కోర్టుకు హాజరుకావాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. అయితే ట్రంప్‌కు ఈ కేసుపరంగా రిపబ్లికన్ల నుంచి భారీమద్దతు లభిస్తోంది. ట్రంప్‌పై ఆరోపణలు చేసిన ఈమె అసలుపేరు స్టెఫానీ క్లిఫర్డ్. 1979లో లూసియానాలో జన్మించిన ఆమె అనేక అడల్ట్ సినిమాల్లో నటించింది. తర్వాత డైరెక్టర్, రచయితగా కూడా మారారు. అసలు ఈ పోర్న్‌స్టార్ ఎవరు ఆమెకు ట్రంప్‌తో ఉన్న సంబంధం ఏమిటి? నిజంగా కలయిక జరిగిందా? ఆనాటి ట్రంప్ సెక్యూరిటీ అధికారులకు ఈ సమాచారం తెలియదా? ఒకవేళ అభియోగాలు విచారణవరకూ వస్తే ట్రంప్ అరెస్టు అయినపక్షంలో ఆయన రాజకీయభవిష్యత్తుపై చెరగని మచ్చపడుతుంది. సుప్రసిద్ధ వ్యాపార సామ్రాజ్యంనుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి అమెరికాఫస్ట్ నినాదంతో అధికార పగ్గాలు చేపట్టిన ట్రంప్ తన హయాంలో వివాదాల మార్గంలోనే పయనించాల్సి వచ్చింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌తో మూడు పర్యాయాలుభేటీ కావడం అయినా చర్చలు సఫలం కాకపోవడం, అఫ్గానిస్థాన్ నుంచి సంకీర్ణ సేనలను ఉపసంహరింపచేయడం వంటి నిర్ణయాలు కొంత ఆయనకు చేటుతెచ్చాయి. ఆయన వ్యక్తిగత జీవితంలోకూడా ఈ పోర్న్‌స్టార్ ఆరోపణలు కొంత సమస్యలు తెచ్చాయన్నది నిర్వివాదాంశం. తనను మరోవారంలో అరెస్టు చేయవచ్చని స్వయంగా ట్రంప్ ప్రకటించిన అంశాన్ని ఇపుడు డెమొక్రాట్లు లేవనెత్తుతూ తన ప్రమేయంలేని పక్షంలో అరెస్టుకు భయం దేనికి అన్న కొత్తవాదం తెరపైకి తెచ్చారు. ఏనాడో 2006లో జరిగిందని చెపుతున్న ఈ సంఘటనను ఇపుడు కొత్తగా తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఇది ఖచ్చితంగా డెమొక్రాట్లపనేనని చెపుతున్న రిపబ్లికన్లు ఇపుడు ట్రంప్‌ను ఈ కేసు నుంచి బయటపడేసే మార్గాలు అన్వేషించడంలో ఇపుడు తలమునకలవుతున్నారు. ట్రంప్ మాత్రం రాజకీయంగాను, న్యాయపరంగానూ పోరాడతామని చెపుతున్నారు. మొత్తంగా చూస్తే అమెరికా చరిత్రలో మొట్టమొదటిసారి ఒక మాజీ అధ్యక్షుడు లైంగిక ఆరోపణలపై కోర్టు విచారణ వరకూ వచ్చిన మొట్టమొదటి నేతగా డొనాల్డ్ ట్రంప్ నిలిచారన్నది నిర్వివాదాంశం. ●

# మహిళలపై హింసను అరికట్టడంలో సఖివన్‌స్టాప్ సెంటర్లు!



డాక్టర్ నీలం సంపత్

రెండువేల పన్నెండువ సంవత్సరంలో దేశ రాజధాని ఢిల్లీ మహానగరం నడిబొడ్డున జరిగిన నిర్భయపై జరిగిన సామూహిక లైంగిక దాడి, అమానవీయ హత్యను నిరసిస్తూ యావత్ దేశంలో నిరసనలు వెల్లువెత్తడంతోపాటు ప్రపంచ మీడియా సైతం సదరు హేయమైన గ్యాంగ్ రేప్‌పై తీవ్ర ఆందోళనను ప్రకటించింది. మహిళలపై మళ్లీ అలాంటి హేయమైన లైంగిక దాడులు, హింసతో ప్రపంచ వేదికపై దేశంలో మహిళలకు రక్షణలేదనే అపప్రథ నెదుర్కోవాల్సి రాకుండా ఉండడం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్భయ చట్టాన్ని జారీ చేయడంతోపాటు మహిళలపై వివిధ రూపాల్లో జరుగుతున్న హింసను అరికట్టడానికి కృషి చేస్తున్న సంస్థలన్నింటినీ సఖి వన్ స్టాప్ సెంటర్ల ఏర్పాటు పేరుతో ఒకే గొడుగు కిందకు తెస్తూ తీసుకున్న నిర్ణయం అభినందనీయమే. నిజానికి నేషనల్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్, ఇందిరాగాంధీ మాతృత్వ సహయోగ్ యోజనకు ఈ పథకం ఓ ఉపపథకంగా ఏర్పాటు చేయడం జరిగింది. సఖి ఓ.యస్.సిల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలతో నిర్భయ ఫండ్‌ని ఏర్పాటు చేయడం గమనార్హం. దేశంలో 29 రాష్ట్రాలు 8 కేంద్రపాలిత ప్రాంతాలలో 704ల సఖివన్ స్టాప్ సెంటర్ల ఏర్పాటు జరగగా మనరాష్ట్రంలో 33 సఖి సెంటర్ల ఏర్పాటు జరిగింది. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి సామాజిక పరిశోధనా కేంద్రం హోదాలో దేశంలోని సఖి వన్‌స్టాప్ సెంటర్లన్నింటికీ మేధోభాగస్వామిగా టిఐస్ ఎంపిక అభినందనీయమే. తెలంగాణ రాష్ట్రమే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఈ దేశంలోని అన్ని ప్రాంతాలలో వేళ్లూనుకున్న అనేక సామాజిక రుగ్మతలూ, సమస్యలను లోతుగా అధ్యయనంచేసి ప్రభావపూరితమైన పరిష్కారాల్ని సూచించిన ఘన చరిత్ర టిస్‌దే. ఈ సామాజిక అధ్యయన వేదిక ఓ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థగా ఈ దేశంలో మహిళలపై వేధింపులు, గృహహింస, లైంగిక దాడులను అరికట్టి మహిళాలోకానికి ఓ శాంతియుతమైన జీవితాన్ని ప్రసాదించడం కోసం సమీకృత కృషిని చేపట్టబోయే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మహిళా శిశుసంక్షేమ, అభివృద్ధి మంత్రిత్వశాఖలు, స్థానిక యన్.జి.ఓ.ల చర్యలను సమన్వయం చేస్తూ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంతోపాటు దాని అమలుకు అవసరమైన విధానాల పరికల్పనతో ఓ చుక్కాని లాగా పనిచేస్తుంది. విధానాలు, ప్రణాళిక ఎంత గొప్పవైనా క్షేత్రస్థాయిలో వాటిని అమలు పరిచే సిబ్బంది ఎంపికతోపాటు వారి అర్హతలూ, నైపుణ్యాలే కాదు అంకితభావంతో కూడిన వారి విధినిర్వహణపైనేఆశించిన ఫలితాలు సాధించడానికి వీలుంటుందనే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. భారతశిషుసంక్షేమ, అభివృద్ధి మంత్రిత్వశాఖ మార్గదర్శకాలనుసరించి నిర్భయ ఫండ్ నిధులతో తెలంగాణ రాష్ట్రంలో 33జిల్లాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు ఛైర్మన్‌లుగా జిల్లాల మహిళా శిషుసంక్షేమ అభివృద్ధి అధికారులతో సమన్వయంతో సఖిసెంటర్లలో ఉద్యోగుల నియామకం, నిర్వహణ కోసం యన్.జి.ఓల ఎంపిక జరుగుతోంది. నేడు మెజారిటీ యన్.జి.ఓలు వ్యాపారసంస్థలుగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణల నేపథ్యంలో సేవాభావంతో పనిచేస్తున్న యన్.జి.ఓలను గుర్తించి వాటికి సఖి సెంటర్లను అప్పగించాల్సిన అవసరం ఎంతైనాఉంది. రాష్ట్రంలో మహిళల రక్షణకోసం పనిచేస్తున్న ఉమెన్‌హెల్ప్‌లైన్స్, హెల్ప్‌డెస్కులు, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ వింగ్‌లు, ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, జిల్లాల న్యాయసేవా అధికార సంస్థలు సఖి వన్‌స్టాప్ సెంటర్లే వేదికగా సింగిల్ విండోగా ఏర్పడి మహిళలు, బాలికలను వివిధ రకాల హింసల బారినుండి కాపాడడం కోసం కృషి చేస్తాయి. అందులో భాగంగా గృహహింసకు, లైంగిక దాడులకు, వేధింపులకూ గురవుతున్న బాధిత మహిళలు, బాలికలకు తక్షణ అత్యవసర సహాయాన్ని అందించడంతోపాటు వైద్యసహాయాన్ని సమకూర్చడం, అవసరమైతే యఫ్.ఐ.ఆర్ నమోదుతో పోలీసుశాఖ తోడ్పాటుకు కృషి చేయడం ఒక ఎత్తైతే సైకో సోషల్ కౌన్సిలింగ్ ద్వారా మహిళలపై వేధింపుల సమస్యలను పరిష్కరించడమే పరమావధిగా ముందుకు సాగడం. ఇది వీలు కానప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించడానికి అవసర




మైన ఉచిత న్యాయసహాయాన్ని అందించడంకూడా సఖి సెంటర్ల బాధ్యతగానే ప్రకటించడం గమనార్హం. చివరిగా ఈ ప్రక్రియ సాగుతున్న కాలంలో బాధితులకు అవసరమైతే సెంటర్లో పూర్తి భద్రతతో అన్నిసౌకర్యాలతో ఆశ్రయాన్ని కల్పించడం విధానంలోభాగమే. పురుషులతోసహా మహిళలకు సమానమైన హోదాతో జీవించే హక్కుని ప్రసాదించి రాజ్యాంగ నిబంధనలకు తిలోదకాలిస్తూ మనుధర్మస్మృతి పునాదులపై నిర్మించబడ్డ పురుషాధిక్య సమాజం మహిళలను ఇంకా పిల్లలనుకనే యంత్రాలుగా, వంటింటి కుందేళ్లుగా, ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తూ వారిపై అనేకరకాల హింసలకు, లైంగికదాడులకు, పాల్పడుతున్న నేపథ్యంలో ఇంటా, బయటా బాలికలు, మహిళలు అనేక రకాల వేధింపులు, హింసకు గురవుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. కుటుంబంలో పురుషులే రాక్షసులుగా మారి బాలికలు, మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్న వైనం కంచే చేను మేస్తే కాపాడే వారెవరుంటారనే సామెతను గుర్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో సింగిల్ విండోగా మారిన సఖివన్ స్టాప్ సెంటర్లద్వారా తమకు ఆశించిన న్యాయం లభిస్తుందని బాధిత మహిళాలోకం కోటి ఆశలతో ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సఖిసెంటర్ల పనితీరుని విశ్లేషించినప్పుడు ఆయా సెంటర్లలో యన్.జి.ఓల ఎంపికతోపాటు అందులో పనిచేసే సిబ్బంది నియామకాల్లో రాజకీయ ఒత్తిళ్లు కొంతమేరకు పనిచేసినందునే సమర్థుల ఎంపిక జరగడం లేదేమోననే ప్రచారం కూడా లేకపోలేదు. ఫలితంగా ఎంపికైన సిబ్బందికి విషయ పరిజ్ఞానం ఉంటే ఉండవచ్చు గాని అత్యంత సంక్లిష్టమైన కుటుంబ వివాదాలను, మానవ సంబంధాలను అధ్యయనం చేసి వాటి మూలాల్లోకి వెళ్లిమారుతున్న మానవ ప్రవృత్తిని అర్థం చేసుకుని అమానవీయ హింసబారి నుండి బాధిత మహిళలు బాలికలను రక్షించేనిర్ణయాలు తీసుకునే అనుభవం లేకపోవడం ఓసమస్యగా మారుతుందని మనోవిజ్ఞానవేత్తలంటున్నారు. దీనికితోడు రాజకీయ జోక్యంతో గతంలో జరిగిన పల్లె పంచాయతీల లాగే ఈ సెంటర్లలోనూ దుడ్డువున్న వాడిదే బర్రె అనే రీతిలో కేసుల పరిష్కార తంతు కొనసాగుతుందని బాధితులు వాపోతుండడం శోచనీయం. కొంతమంది యన్.జి.ఓల అధినాయకులు నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళల్లో సఖి సెంటర్లలోనే నిద్రిస్తున్నారనే ఆరోపణలు బాధిత మహిళలు, బాలికల భద్రతకు భంగం కలిగించేవే. సైకో సోషయాలాజికల్ కౌన్సిలింగ్‌తో వివాదాలను పరిష్కరించి హింసను అరికట్టాల్సిన విధానానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వకుండా మెజారిటీ వివాదాలను యఫ్.ఐ.ఆర్‌ల నమోదుతోపోలీసు స్టేషన్లవైపు మళ్లిస్తున్నారనే వాదన కూడా ప్రస్ఫుటంగానే వినపడుతోంది. ఫలితంగా కౌన్సిలింగ్ కాగితాలకే పరిమితమై బాధితులంతా పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులేర్పడుతుండడం బాధాకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మహిళా శిశుసంక్షేమ, అభివృద్ధిశాఖల సమన్వయంతో స్థానిక యన్.జి.ఓల నేతృత్వంలో మహిళల రక్షణ కోసం పనిచేయాల్సిన తరుణంలో కేంద్రం సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నందునే నిధుల కేటాయింపు జరగక నెలలతరబడి సంస్థ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేకపోతున్నామనే ప్రాధికార యన్.జి.ఓలతోపాటు రాష్ట్రప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే ఈ వాదనకు భిన్నంగా కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవడంలోనూ రాష్ట్రం విఫలమవుతున్నందనే ఆశించిన ఫలితాలను అందుకోలేకపోతున్నామనే కేంద్ర ప్రభుత్వ ప్రత్యారోపణలతో సఖిసెంటర్ల నిర్వహణ అగమ్యగోచరంగామారుతుండడం శోచనీయమే. సఖివన్‌టైమ్ సిబ్బంది తమ ఆదేశాలను పాటించడంలేదనే అక్కసుతో యన్.జి.ఓలను తప్పించి రాష్ట్ర ప్రభుత్వ మహిళా శిశుసంక్షేమ అభివృద్ధిశాఖద్వారానే సఖి సెంటర్లను నిర్వర్తించాలనే ఆలోచనకు ప్రభుత్వం వచ్చిందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. మహిళల రక్షణ కోసం, సంక్షేమం కోసం ఎన్ని చట్టాలను జారీ చేసినా, నేరస్తులకు ఉరిశిక్షలను విధించినా మహిళల భద్రతలో ప్రపంచంలో 136వ స్థానంలో ఉండడం 64 శాతం మహిళలపై నేరాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో సఖివన్ స్టాప్ సెంటర్లలో ఉద్యోగుల నియామక ప్రక్రియను తదనంతర నిర్వహణనూ పారదర్శకంగా నిర్వహించడంకోసంఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా సేవాదృక్పథంలో పనిచేస్తున్న యన్.జి.ఓలకే సఖి సెంటర్లను కేటాయించాలి. అవసరమైన అర్హతలూ, అనుభవం కలిగిన వ్యక్తులనే ఉద్యోగులుగా నియామకం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖివన్ స్టాప్ సెంటర్లను రాజకీయ వేదికలుగా మార్చకుండా సమాజంలో సగభాగమైన మహిళల రక్షణ కోసం ఈ నాలుగంచెల విధానాన్ని పూర్తి సమన్వయంతో త్రికరణశుద్ధిగా అమలుపరచాల్సిందే. ఓ ఉపన్యాయ వ్యవస్థ రూపంలో బాధితులకు ఆశించిన న్యాయాన్ని చేకూర్చాలే తప్ప రక్షణకోసం తమను ఆశ్రయించిన బాధితులందరినీ కట్టగట్టి పోలీసులు న్యాయస్థానాల వద్దకు చేర్చేమధ్యవర్తులుగా పనిచేయరాదనే సామాజికవేత్తల అభిప్రాయాన్ని గౌరవించాల్సిందే. ●



## ఢిల్లీకి వస్తే..ఎకె-47తో కాల్చేస్తామన్నారు: సంజయ్ రౌత్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఎంపీ సంజయ్ రౌత్‌కు గ్యాంగ్‌స్టర్ల నుంచి బెదిరింపులు వచ్చాయి. దీంతో ఆయన ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనకు ఈ బెదిరింపులు వచ్చా యని ఆయన ఆరోపించారు. పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలా మాదిరిగానే తననూ చంపేస్తామని వారు హెచ్చరించారని రౌత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో కొందరు నాకు ఫోన్ చేసి బెదిరించారు. ఢిల్లీకి వస్తే ఏకే 47 తుపాకీతో కాల్చి చంపేస్తామని వారు హెచ్చరించారు. మూసేవాలాకు పట్టిన గతే నాకూ పడుతుందన్నారు. దీనిపై నేను పోలీసులకు ఫిర్యాదు చేశాను' అని సంజయ్ రౌత్ మీడియాకు వెల్లడించారు. అయితే ఈ విషయంపై తాను ఫిర్యాదు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణించట్లేదని ఆయన ఆరోపించారు. గతంతోనూ నాకు ఇలాగే బెదిరింపులు వచ్చాయి. కానీ రాష్ట్ర హోంమంత్రి ఇది కేవలం స్టంట్ అని కొట్టిపారేస్తున్నారు. ప్రతిపక్ష నేతల భద్రతను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని రౌత్ దుయ్యబట్టారు. కాగా రౌత్ ఫిర్యాదుపై ముంబై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బెదిరింపులు వచ్చిన ఫోన్ నంబరును ట్రేస్ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఓ అనుమానితుడిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఇటీవల మరో గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ నుంచి బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు వచ్చిన విషయం విదితమే.

# రూ.150.95 లక్షలకోట్లకు చేరిన రుణభారం

### ప్రభుత్వ రుణనిర్వహణ నివేదిక ప్రకటించిన ఆర్థికశాఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఆర్థికసంవత్సరం ముగియడంతో భారత్ ఆస్తిఅప్పుల పట్టీని సిద్ధంచేసింది. సెప్టెంబరు చివరినాటికి భారత్ అప్పులు 147.19 లక్షలకోట్లుగా ఉన్నాయి. అవి ఆర్థికసంవత్సరంముగిసేనాటికి 150.95 లక్షలకోట్లకు పెరిగినట్లు తేలింది. అక్టోబరు డిసెంబరుత్రైమాసికాల్లో చూస్తే ప్రతి మూడునెలలకు 2.6శాతంచొప్పున రుణభారం పెరుగుతున్నది. మొత్తం అప్పులు ప్రభుత్వ పద్దులో డిసెంబరు చివరినాటికి 1,50,95,970.8 కోట్లకు పెరిగినట్లు ప్రభుత్వ రుణ నిర్వహణ నివేదికలో పొందుపరిచింది. అదే గత సెప్టెంబరునాటికి మొత్తం అప్పులు 1,47,19,572.2కోట్లుగా ఉన్నాయి. శనివారం ఆర్థికశాఖ ఈమేరకు మొత్తం నివేదికప్రకటించింది. మొత్తం అప్పుల్లో ప్రభుత్వ రుణాలు 89శాతం వాటాతో ఉన్నాయి. సుమారు 29.29శాతం సెక్యూరిటీలు మెచూరిటీ ఐదేళ్లలోపే ఉంది. మూడో త్రైమాసికంలో కేంద్రం 3.51 లక్షలకోట్లను సెక్యూరిటీలద్వారా సమీకరించింది. వాస్తవానికి ప్రభుత్వం నోటిఫైచేసిన మొత్తం ఒక కేలండర్ సంవత్సరంలో 3.18 లక్షలకోట్లు కాగా అంతకుమించే సేకరించింది. మూడో త్రైమాసికంలో సెక్యూరిటీల మెచూరిటీలపై చెల్లించాల్సిన మొత్తం 85,377.9 కోట్లుగా ఉంది. ఈ మొత్తం చెల్లించినట్లు వెల్లడించింది. సెక్యూరిటీల జారీలో రాబడులు 7.38శాతంగామూడో త్రైమాసికంలో ఉంటే రెండోత్రైమాసికం కంటే స్వల్పంగా రాబడులు పెరిగాయి. కొత్తగా జారీచేసే సెక్యూరిటీల మెచూరిటీలు 16.56 సంవత్సరాలుగా ఉంది. అదే




రెండోత్రైమాసికంలో 15.62 సంవత్సరాలకుమెచూరిటీ పరిమితిగా నిర్ణయించింది. అలాగేనగదు నిర్వహణ బిల్లులరూపంలో ప్రభుత్వం ఎలాంటి నిధులను సేకరించలేదని ఆర్థికశాఖప్రకటించింది. ఈ త్రైమాసికంలో రిజర్వుబాంకు ప్రభుత్వంకోసం ఎలాంటి ఓపెన్‌మార్కెట్ లావాదేవీలు నిర్వహించ లేదని తేల్చింది. నగదు సర్దుబాటు సౌకర్యం కింద రోజువారి సగటు నగదు నిర్వహణ 39,604 కోట్లుగా ఉంది. ఇక సెక్యూరిటీలపరంగా చూస్తే పదేళ్ల బెంచ్‌మార్క్ సెక్యూరిటీలపై 7.40శాతంగా సెప్టెంబరుచివరినాటికి ఉంది. అదే డిసెంబరు చివరినాటికి 7.33శాతంగా ఉంది. ఏడు బేసిస్ పాయింట్లు రాబడులు తగ్గాయి. గత ఏడాదిడిసెంబరు ఏడో తేదీ ఆర్‌బిఐ నిర్వహించిన మానిటరీ పాలసీ సమీక్షలో కమిటీ రెపోరేట్లను 35 బేసిస్‌పాయింట్లను పెంచింది. దీనితో రెపోరేట్లు 5.9శాతంనుంచి 6.25శాతంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం కట్టడిచేసేందుకే ఈ చర్యలుచేపట్టినట్లు అప్పట్లో ఆర్‌బిఐ ప్రకటించింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి ఎనిమిదవ తేదీ రిజర్వుబ్యాంకు బెంచ్ మార్క్ రెపోరేట్లను మరో 25 బేసిస్ పాయింట్లు పెంచింది.ద్రవ్యోల్బణ కట్టడిచర్యల్లో భాగంగా ఈపెంపు చేసామని చెప్పడంతో రెపోరేట్లు 6.5శాతానికి పెరిగాయి.

# రికార్డుస్థాయిలో జీఎస్టీ వసూళ్లు: మార్చిలో 1.60 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** జీఎస్టీ వసూళ్లు మరోసారి లక్షన్నరకోట్లను దాటేసాయి. మార్చినెలలో జీఎస్టీ వసూళ్లు 13శాతంపెరిగి 1.60 లక్షలకోట్లుగా ఉన్నట్లు ఆర్థిక శాఖప్రకటించింది. ఈ ఆర్థికసంవత్సరంలో వరుసగా నాలుగోసారి లక్షన్నరకోట్లు దాటిందని ఆర్థికశాఖ వివరించింది. మార్చినెలలో 1,60,122కోట్ల మేర జీఎస్టీ వసూళ్లు జరిగితే ఆ మొత్తంలో సిజిఎస్‌టి 29,546 కొటట్లు, ఎస్‌జిఎస్టీ 37,314కోట్లు, ఐజిఎస్‌టి 82,907 కోట్లరూ పాయలుగా ఉంది. ఈ మొత్తం 42,503 కోట్ల రూపాయలు దిగుమతి వస్తువులపై వేసిన సుంకంగా పేర్కొంది. అలాగే అదనపు సెస్‌రూపంలో 10,355 కోట్లు వసూలుచేసింది. ఈ మొత్తంలో కూడా 960 కోట్లు దిగుమతులద్వారా సమకూరిందని ఆర్థికశాఖ ప్రకటించింది. ఐజిఎస్టీ వసూళ్లు ఈసారి అత్యధికంగా రాబట్టినట్లు స్పష్టంఅవుతోంది. ప్రభుత్వం 33,408 కోట్లు సిజిఎస్‌టి, 28,187 కోట్లు ఎస్‌జిఎస్‌టిని నిరంతర సెటిల్‌మెంట్‌కింద రాష్ట్రాలకు కేటాయించింది. కేంద్ర, రాష్ట్రాలకు మొత్తం రాబడులు మార్చినెలలో ఐజిఎస్‌టి సెటిల్‌మెంట్ తర్వాత 62,954 కోట్లుగా సిజిఎస్‌టికి ఉంటే, 65,501 కోట్లు ఎస్‌జిఎస్‌టికి ఉన్నట్లు తేలింది. గత ఏడాది ఇదేనెల రాబడులకంటే జీఎస్టీ 13శాతం అధికంగా ఈ ఏడాది రాబట్టింది. దిగుమతులపై విధించిన సుంకాలు,పన్నులు కూడా




8శాతంపెరిగింది. దేశీయ లావాదేవీలు కూడా 14శాతం గత ఏడాది మార్చికంటేపెరిగినట్లు తేలింది. అలాగే మార్చినెలలో రిటర్నులు కూడా 93.2శాతంపెరిగాయి. జీఎస్‌టిఆర్‌వన్‌లో భారీ వృద్ధినమోదుకాగా జీఎస్‌టి ఆర్3బిలు కూడా పెరిగాయి. 91.4శాతం రిటర్నులు దాఖలయినట్లు ఆర్థికశాఖ వివరించింది. 2022:23 సంవత్సరానికిగాను స్థూల జీఎస్టీ రాబడులు 18.10 లక్షలకోట్లుగా ఉంది. నెలసరి సగటు వసూళ్ల పూర్తి సంవత్సరంలో 1.51 లక్షలకోట్లుగా ఉన్నాయి. 2022:23 లో స్థూల రాబడులు గత ఏడాదికంటే 22శాతంపెరిగాయి. సగటు స్థూల రాబడులు చివరి త్రైమాసికంలో 1.55 లక్షలకోట్లుగా ఉంది. అంతకుముందు త్రైమాసికాల్లో వరుసగా 1.51 లక్షలు, 1.46 లక్షలు, 1.49 లక్షలకోట్లుగా ఉన్నాయి.

## విదేశీ పర్యటన కోసం రూ.4 కోట్లు

### రిషి సునాక్‌పై విమర్శలు



**లండన్, ఏప్రిల్ 1:** బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రిషి సునాక్‌ను విమర్శలు, వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా ఆయన మరోసారి వివాదాస్పద వార్తల్లో నిలిచారు. ఇటీవల రిషి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఓ కొత్త పాలసీపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ మేరకు యూకే ప్రధాని రిషి సునాక్ విదేశీ పర్యటనల కోసం కేవలం ప్రైవేట్ జెట్ల కోసమే సుమారు రూ.4 కోట్లు ఖర్చు పెట్టినట్లు నివేదిక వెల్లడించింది. ఈజిప్టులో జరిగిన కాప్ 27సదస్సుకు హాజరయ్యేందుకు ప్రభుత్వం ప్రైవేట్ జెట్లకు దాదాపు రూ.96 లక్షలు ఖర్చు చేసింది. తన భార్య అక్షతా మూర్తి వ్యాపార ప్రయోజనాల కోసమే ఆ నూతన విధానాన్ని తీసుకొచ్చారంటూ రిషిపై విమర్శలు గుప్పిస్తున్నాయి. మార్చి ఆరంభంలో యుకే ప్రభుత్వం స్ప్రింగ్ బడ్జెట్‌ను ప్రవేశపె ట్టింది. అందులో చిన్నారుల సంరక్షణను ఆయాల సేవలను అందించే కంపెనీలకు ప్రోత్సాహకాలు కల్పించేలా నూతన పైలట్ పథకాన్ని ప్రకటించారు. కాగా ఇలాంటి సేవలనే అందించే కోరు కిడ్స్ లిమిటెడ్ అనే కంపెనీలో రిషి సతీమణి అక్షతా మూర్తి వాటాదారుగా ఉన్నారు. దీంతో భార్య వ్యాపార ప్రయోజనాల కోసమే ప్రధాని ఈ పైలట్ ప్రాజెక్టును ప్రవేశపెట్టారంటూ ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.' ఈ స్కీమ్‌ను తీసుకురావడం వెనుక ప్రత్యేక ఆసక్తి ఏమైనా ఉందా? సొంత ప్రభుత్వ విధానాల నుంచి రిషి కుటుంబం అదనపు ఆదాయాన్ని పొందాలనుకుంటుందా? ఈ ప్రశ్నలకు సునాక్ సమాధానం చెప్పాల్సిందే' అని ప్రతిపక్ష లిబరల్ డెమోక్రాట్ చీఫ్ విప్ వెండీ ఛాంబర్లేన్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలను 10 డౌనింగ్ స్ట్రీట్ ఖండించింది. కాగా రిషి సునాక్ ప్రధాని కాకముందు కూడా తన భార్య పన్నుల వ్యవహారం తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే.

## చుక్కలనంటిన పాకిస్థాన్ ద్రవ్యోల్బణం



### గతనెలలో 35.37%గా నమోదు

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 1:** పాకిస్థాన్‌లో ఏటికేడాది చూస్తే ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకుతోంది. మార్చి నెలలో ద్రవ్యోల్బణం 35.37శాతంగా ఉన్నట్లు ప్రభుత్వమే ప్రకటించింది. ఐదు దశాబ్దాల నాటి గరిష్టానికి చేరుకుంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి షరతులను అమలుచపరిచేందుకు పాకిస్థాన్‌ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో అన్ని రంగాలు కుదేలయ్యాయి. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయి. నెలవారీగాచూస్తే సగటున 3.72శాతంగా పెరిగింది. గత ఏడాది ద్రవ్యోల్బణం 27.26శాతంగా ఉంది. ఆర్థికరంగపరంగా క్రమశిక్షణారాహిత్యంవల్లనే ఈపరిస్థితులు దాపురించాయి. రాజకీయ అనిశ్చితి ఇందుకు తోడయింది. పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి ఈరెండే కారణాలని నిపుణులు అంచనావేసారు. అంతేకాకుండా అంతర్జాతీయంగా నెలకొన్న ఇందన సంక్షోభం, మరోపక్క వరదల భీభత్సంతో మరింతకుదేలయింది. దేశంలోని మూడోవంతుభాగాన్ని గత ఏడాది వరదలు అతలాకుతలంచేసాయి. ప్రస్తుతం ఉన్న రుణభారం అధిగమించాలంటే పాక్‌కు బిలియన్లకొద్దీ డాలర్ల ఆర్థికసాయం అవసరం అవుతుంది. దీనికితోడు విదేశీ కరెన్సీ రిజర్వులు కూడా తగ్గిపోయాయి. పాకిస్థాన్‌రూపాయి అత్యంత కనిష్టస్థాయికి చేరింది. రంజాన్‌మాసంలో ముస్లిం సోదరులు పవిత్ర ప్రార్థనల సమయంలో కూడా ఆహార ఉత్పత్తులకోసం ఏర్పడిన రద్దీలో కనీసం 20 మందికిపైగా చనిపోయారు. ఆహార పంపిణీ కేంద్రాల వద్దజరిగిన తొక్కిసలాటలోనే ఈ మరణాలు సంభవించాయి. కరాచీలో ముందు రోజు జరిగిన తొక్కిసలాటలోనే 12 మంది చనిపోయారు. 2.20 కోట్ల జనాభా ఉన్న ఈ దక్షిణాసియా దేశం అత్యంతతీవ్రస్థాయి రుణభారంతో సతమతం అవుతోంది. ఇందుకోసం పన్ను సంస్కరణలు కూడా తీసుకురావాలి. ఐఎంఎఫ్ అందించే మలివిడత 6.5 బిలియన్ డాలర్ల బెయిలౌట్ ప్యాకేజికి ఐఎంఎఫ్ ఆదేశాలు తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం వచ్చింది.

## తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

**ముంబై, ఏప్రిల్ 1:** గ్యాస్ ధరలపై కేంద్ర ప్రభు త్వం శుభవార్త అందించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి రోజునే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల ధరలను సవరించింది. ఏప్రిల్ 1 వంట గ్యాస్ ధరలు దాదాపు రూ.92 తగ్గించింది. అయితే రేట్ల తగ్గింపు కేవలం వాణిజ్య గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు మాత్రమే. గృహోపయోగానికి వినియోగించే డొమెస్టిక్ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి తగ్గింపు లేదు. 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరలను ప్రభుత్వం గత నెలలోనే రూ.50 పెంచిన విషయం విదితమే. అలాగే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను రూ.350 పెంచింది. సాధారణంగా కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి రోజున పెట్రోలియం కంపెనీలు ఎల్‌పిజి సిలిండర్ల ధరలను సవరి స్తుంటాయి.డాలర్‌తో రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ రేటు భారతదేశంలో ఎల్‌పిజి సిలిండర్ ధరలను ప్రభావితం చేసే రెండు కీలక అంశాలు. సవరించిన తర్వాత 19 కేజీలవాణిజ్య సిలిండర్ ధర ఢిల్లీలో రూ. 2,028, కోల్‌కతాలో రూ.2,132, ముంబైలో రూ.1,980,చెన్నైలో రూ,.2,192.50 చొప్పున ఉంది. కాగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం గృహ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్‌లపై సబ్సిడీని ప్రకటించింది. ఈ పథకంకింద 9.59కోట్ల మంది లబ్ధిదారులకు ప్రతిఎల్‌పిజి గ్యాస్‌సిలిండర్‌పైనారూ.200 సబ్సి డీ అందిస్తున్నట్లు సమాచార,ప్రసారశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ గతనెలలో ప్రకటించారు.

## ప్రాణాలకు తెగించి ముగ్గురు స్నేహితులను కాపాడిన పదేళ్ల బాలుడు

### రూ.లక్ష చెక్కు ఇచ్చి అభినందించిన గోవా ప్రభుత్వం

**పనాజీ, ఏప్రిల్ 1:** గోవాలో పదేళ్ల బాలుడు తనతో ఆడుకునే ముగ్గురు చిన్నారులను ప్రాణాపాయం నుంచి కాపాడి అందరి ప్రశంసలూ అందుకుంటున్నాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. గోవా రాజధాని పనాజీ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుంబార్జువాలో గ్రామ దేవత ఉత్సవాలు జరుగుతుండగా, వాటిని తిలకించేందుకు నలుగురు చిన్నారులు అక్కడికి వెళ్లారు. రంగులు చల్లుకొని ఆడుకున్నారు. అనంతరం దగ్గరలోని నది వద్దకు వెళ్లారు. స్నానం చేసేందుకు నదిలోకి దిగిన ముగ్గురు చిన్నారులు నీటిలో జారి పడిపోయారు. వారికి ఈతరాక మునిగిపోయారు. అదంతా చూసిన అంకుర్‌కుమార్ సంజయ్‌ప్రసాద్ అనే పదేళ్ల బాలుడు వారిని కాపాడేందుకు నదిలోకి దూకాడు. ఒకరి తర్వాత ఒకరిని ఒడ్డుకు చేర్చాడు. సిపిఆర్ చేయడంతో వారు స్పృహలోకి వచ్చారు. అనంతరం స్థానికుల సాయంతో అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. తన స్నేహితులను కాపాడేందుకు ధైర్యసాహసాలు ప్రదర్శించిన సంజయ్ పేరు గోవాలో మార్మోగుతోంది. బాలుడి సాహసాన్ని గుర్తించిన ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష బహుమతితో సత్కరించింది. సిఎం ప్రమోద్‌సావంత్ స్వయంగా చెక్కు అందించి బాలుడిని అభినందించారు. 'చిన్న వయసులో ధైర్యసాహసాలు ప్రదర్శించి తన స్నేహితులను కాపాడిన బాలుడిని కలవడం ఎంతో ఆనందంగా ఉంది. అంకుర్ సరైన సమయంలో తన సమయస్ఫూర్తితో తోటి పిల్లల జీవితాలను కాపాడాడు. అతణ్ని చూసి గోవా గర్విస్తోంది. అతణ్ని ప్రోత్సహించేందుకు రూ.లక్ష చెక్కు అందజేశాం. తనకు ఉజ్వల భవిష్యత్ ఉండాలని ఆశిస్తున్నాన్లు అని ప్రమోద్ సావంత్ ట్వీట్ చేశారు. బాలుడితో దిగిన ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.



## వడోదరలో అల్లర్లపై దర్యాప్తునకు సిట్

### 23మంది అరెస్ట్, 500మందిపై ఎఫ్ఐఆర్

**గాంధీనగర్, ఏప్రిల్ 1:** శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా వడోదరలో చెలరేగిన అల్లర్లపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసినట్లు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది. క్రైం విభాగం డిసిపి నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన పోలీస్ బృందం ఈ సిట్‌లో ఉంటుంది. వడోదరలోని కుంభద్వార..హాథీఖానా ప్రాంతంలో మార్చి 30న శోభాయాత్ర సందర్భంగా రాళ్లు రువ్విన ఘటన జరిగి, ఉద్రిక్తతలకు దారితీసింది. అల్లర్లను ప్రేరేపించేందుకు యత్నించినట్లు అనుమానమున్న 23మందిని వడోదర పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. అల్లర్లు జరిగినపుడు తీసిన వీడియో ఫుటేజ్ ఆధారంగా ఈ అరెస్ట్‌లు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

వడోదరలోని స్థానిక కోర్టులో నిందితుల్ని హాజరు పరచగా, వారిలో ఐదుగురిని ఐదురోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. మిగతా 18మందిని జ్యుడిషియల్ కస్టడీకి తరలించాలని ఆదేశించింది. ఈ ఘటనకు సంబంధించి మరో 500మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో శోభాయాత్ర వెళ్తున్నపుడు అల్లర్లు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## రూ.15,920 కోట్లకుపెరిగిన రక్షణరంగ ఎగుమతులు

### కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** భారత రక్షణరంగ ఎగుమతులు ఆల్‌టైమ్ రికార్డుస్థాయికి చేరినట్లు రక్షణ మంత్రిరాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు. ఇదొక అనూహ్య లక్ష్య సాధన అని సంబంధిత విభాగాలనుప్రశంసించారు. ఈ ఆర్థికసంవత్సరంలో 15,920 కోట్ల ఎగుమతులు జరిగాయని, గత ఏడాది 12,814 కోట్లవరకూ జరిగిన ఎగుమతులు ఈ సంవత్సరంలో మరింతపెరిగాయని ఆయన అన్నారు. ఎగుమతులపై ఆయన తన ట్విట్టర్‌ఖాతాలో వివరాలు వెల్లడిస్తూ మిలిటరీ హార్డ్‌వేర్‌ను 8434 కోట్లరూపాయలు గత ఏడాది ఎగుమతి చేసామని, అంతకుముందు ఏడాది 9115 కోట్లు, 2018:19 సంవత్సరంలో 10,745కోట్లు ఎగుమతులుజరిగాయన్నారు. 2017:18 సంవత్సరంలో 4682 కోట్లు, 2016:17ల్లో 1521కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఇక రక్షణరంగ హార్డ్‌వేర్ తయారీలో 1.75 లక్షలకోట్లు విలువైన ఉత్పత్తులుజరగాలని ప్రభుత్వం లక్ష్యం విదించిందన్నారు. దీనితో రక్షణరంగ ఎగుమతులు 2024:25 నాటికి 35వేలకోట్లకుపెరుగుతాయని అన్నారు. గడచిన కొన్నేళ్లుగాప్రభుత్వం దేశీయ రక్షణరంగ ఉత్పత్తులనుప్రోత్సహించేందుక అనేక సంస్కరణలు తెచ్చిందని ఆయన పేర్కొన్నారు.

## చెన్నైలోని కళాక్షేత్రలో లైంగిక వేధింపులు

### విద్యార్థినుల ఆందోళన



**చెన్నై, ఏప్రిల్ 1:** చెన్నైలోని కళాక్షేత్ర ఫౌండేషన్‌కు చెందిన ఓ కళాశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలొచ్చాయి. రుక్మిణీదేవి కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో హరిపద్మన్ అనే అసిస్టెంట్ ప్రొఫెసర్ మరో ముగ్గురు ఆర్టిస్టులపై కేసు నమోదైంది. ఓ పూర్వ విద్యార్థిని ఫిర్యాదుమేరకు ఈ కేసు నమోదైంది. లైంగిక వేధింపులు, బాడీ షేమింగ్, తదితర వేధింపులకు గురవుతున్నామని కొన్నిరోజులుగా 200మంది విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. 90మంది విద్యార్థినులు రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేఖ రాశారు. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర సాంస్కృతికశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి కూడా లేఖరాశారు. యేళ్లుగా వేధింపులు, కుల వివక్ష ఎదుర్కొంటున్నామని, తమ ఫిర్యాదులపై అధికా రులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. కళాక్షేత్ర డైరెక్టర్ రేవతి రామచంద్రన్‌ను పదవి నుంచి తొలగించాలని కోరారు. కురుక్షేత్ర ఫౌండేషన్‌ను1936లో రుక్మిణీదేవి అరుండలే స్థాపించారు. అక్కడ భరతనాట్యంలాంటి సంప్రదాయిక కళలను నేర్పే కోర్సులు అంది స్తారు. ఉన్నత ప్రమాణాలకు మారుపేరుగా ఉన్న సంస్థ ఇప్పుడు వివాదాల్లో చిక్కుకుంది.

## కులగణన జరపాల్సిందేనని ఎన్‌డిఎపై కాంగ్రెస్ ఒత్తిడి

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1:** కులగణనకోసం కాంగ్రెస్‌పార్టీ ఇతర ప్రతిపక్ష పార్టీలన్నింటితోకలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ కుల గణన అనేది నిర్దిష్టంగా జరగలేదు. 1931లో జరిగిన కుల గణన ఆధారంగా మాత్రమే ఇపుడు ప్రభుత్వ విధివిధానాలు నడుస్తున్నాయి. ఓబిసి వ్యతిరేకకాంగ్రెస్ అని ప్రచారాన్ని ముమ్మరంచేస్తున్న బిజెపిని కట్టడిచేసేందుకు అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్ల అయినా ఇప్పటికీ కులగణన ఎందుకు చేపట్టలేదన్న వాదనతో ఇపుడు కాంగ్రెస్ పార్టీ మరో కొత్త వాదనను తెరపైకి తెచ్చింది. తానుమాత్రమే కాకుండా తనతోపాటు కలిసివచ్చే అన్ని ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని అధికార బిజెపి విమర్శలకు కౌంటర్ ఇవ్వడంతోపాటు ఎప్పుడో 92 ఏళ్లకిందట జరిగిన కులగణన ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, దీనివల్ల అనేక మంది అర్హులు ప్రయోజనాలు కోల్పోతున్నారని కాంగ్రెస్ పార్టీ వాదిస్తోంది. సమాజ్‌వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, జనతాదళ్‌యునైటెడ్ పార్టీలతో ఇప్పటికే ఈ చర్చలుజరిగాయి. ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకుల తోకూడా కాంగ్రెస్ చర్చలుజరుపుతోంది. అన్నీ సజావుగా సాగితే సత్వ రమే ఇక కులగణన చేపట్టాలని డిమాండ్‌చేస్తూ ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ కృషిచేస్తోంది. మోడీ ఇంటిపేరును కించపరిచిన రాహుల్‌గాంధీ దేశంలో మొత్తం ఓబిసి కులాన్నే కించపరి చారంటూ బిజెపి కాంగ్రెస్ పార్టీపై విమర్శల దాడిని పెంచిన సంగతి తెలిసిందే. ఇపుడు ఈ విమర్శలను తిప్పికొట్టేందుకు అసలైన అస్త్రం సిద్ధంచేయాలని నిర్ణయించిన కాంగ్రెస్ కులగణన సర్వేను తెరపైకి తెచ్చింది.

## ఒక్కరోజులో కరోనా కేసులు 2993, మృతి ఏడు

### దేశంలో మొత్తం బాధితులు 4,47,18,781

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్1:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది.గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 2993 కేసులు నమోదయ్యాయి. మృతి ఏడుగురు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,47,18,781కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,71,551 మంది కోలుకోగా 16,354 మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,876కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.78 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,44,111కి చేరగా,79,92,580 మందివరకు కోలుకున్నారు.1,48,441 మంది ప్రాణాలు కోల్పోయారు.కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 68,36,683కి చేరింది.అందులో 67,60,686మంది కోలుకున్నారు.71,622 మంది మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,77,389కి చేరింది.అందులో 40,35,957 మంది కోలుకున్నారు.40,324 మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య35,96,790కి చేరింది.అందులో 35,57,963 మంది కోలుకున్నారు. 38,050 మంది మరణించారు.

## మా ఇంటికి రండి..మా ఇల్లే మీఇల్లు

### రాహుల్‌గాంధీకి నెటిజన్లు, కాంగ్రెస్ నేతల ట్వీట్లు



**బెంగళూరు, ఏప్రిల్ 1:** మోడీ ఇంటిపేరును కించపరిచారన్న అభియోగాలపై రెండేళ్ల జైలుశిక్ష, ఆపై లోక్‌సభలో అనర్హత వేటుపడిన రాహుల్‌గాంధీని ఆయన నివసి స్తున్న అధికారిక భవంతిని ఖాళీచేయాలని లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఇపుడు ఎఐసిసి మాజీ అధ్యక్షుడికి సానుభూతి విపరీతంగా పెరిగిపోయింది. గడచిన రెండురోజులుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇతరులు కూడా 'మేరా ఘర్ ఆప్‌కా ఘర్' అంటూ ట్వీట్లు వెల్లువెత్తిస్తూ ఆయన్ను ఆహ్వానిస్తున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకించి ఈ ప్రచారం కూడా ప్రారంభించారు. రాహుల్‌ను తమ నివాసానికి రావాలని ఆహ్వానాలు పంపిస్తున్నారు. మాజీ మంత్రులు కెజె జార్జి, దినేష్ గూండూరావు, జమీర్ అహ్మద్, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ ఇతరులు కూడా ఒక పోస్టరును చేతబట్టుకుని మా ఇల్లే మీ ఇల్లు అన్న నినాదాలతో ఉన్న బ్యానర్లను వారి ఇంటిముందు వేలాడదీసారు. రాహుల్‌గాంధీ లాంటి వ్యక్తికి ప్రభుత్వ భవనం అవసరం లేదని, తమనాయకుడు మా గుండెల్లోనే ఉంటాడని, మా ఇంట్లోనే ఉండాలని ఆహ్వానించడం మాకర్తవ్యమని రిజ్వాన్ ట్వీట్‌చేసారు. మేమంతా మీవెంటే. మాఇంటికి రండి అంటూ ట్వీట్లు వెల్లువెత్తించారు. ఈ కుట్రల తుపానులో మిమ్మల్ని నిరాశ్రయులని ఎవరుఅంటారు. మేమంతామీవెంటే అన్న ట్వీట్లు సోషల్‌మీడియాలో వెల్లువెత్తాయి.

## శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

### బొలెరో వాహనం, స్కూటర్ ఢీ

### ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

**పెద్దదోర్నాల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పెద్దదోర్నాల మండల పరిధి శ్రీశైలం ఘాట్ రోడ్డు శిఖరేశ్వర సమీపంలో బొలెరో వాహనం - స్కూటర్ ఢీకొని రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన శనివారం జరిగింది. ఈ సంఘటనలో నంద్యాల జిల్లా శ్రీశైలం దైవస్థానాకి చెందిన అర్చకుడు చిలిమికోట శివనాగ ప్రసాద్(47) పల్నాడు జిల్లా మాచర్ల ముదిరాజట్ సొసైటీ కాలనీకి చెందిన వాలంటీర్ కొరట వెంకటేష్(36) అక్కడికక్కడే మృతి చెందారు. బొలెరో వాహనంలో ఉన్న వెంకటేష్‌కు రోడ్డు పక్కన ఉన్న ఇనుప రాడ్డు పొట్టలో గుచ్చుకొని అక్కడికక్కడే మృతిచెందగా స్కూటర్‌పై వెళ్తున్న అర్చకుడు చిలిమికోట శివ నాగ ప్రసాద్ కూడా సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. డ్రైవర్ నల్లబోలు సుధీర్, ఉన్నం మహేష్‌కుమార్, దుర్గ హరిప్రసాద్, బెల్లంకొండ హరిబాబులకు గాయాలయ్యాయి. వీరు సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నారు. సమాచారం అందుకున్న పెద్దదోర్నాల ఎస్సై ఎం.శ్రీనివాసరావు తన సిబ్బందితో హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిలిమికోట శివనాగప్రసాద్, కొరట వెంకటేశ్వర్లు మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.





# ప్రపంచదేశాల్లో 68.39 కోట్ల వైరస్‌కేసులు

### 68.31 లక్షల మరణాలు



**జెనీవా,ఏప్రిల్ 1:** ప్రపంచదేశాల్లో కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొత్తకేసులతో మరింత ఆందోళన పెరుగుతోంది. శనివారం నాటికిప్రపంచ వ్యాప్తంగా 68.39 కోట్లకుపైగా కేసులు నమోదుకాగా 68.31 లక్షలమందిచనిపోయారు. మరో 39,911 మంది పరిస్థితి విషమించింది. రికవరీలు 65.69కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.02 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. యూరోప్ దేశాల్లో 24.78 కోట్లమందికివైరస్‌సోకి 20.30 లక్షలమందిచనిపోయారు. మరో 6436 మందిపరిస్థితి విషమంగా ఉంది.ఇ రికవరీలు 24.35 కోట్లకుపైగా నమోదుకాగా మరో 23.59 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 12.57 కోట్లకుపైగా కరోనా కేసులు నమోదుకాగా 16.22 లక్షలమంది చనిపోయారు. మరో 7148 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.12 కోట్లకుపైగా నమోదుకాగా మరో 27.91 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 21.52 కోట్లకుపైగా బాధితు లుంటే వారిలో 15.40 లక్షలమందిచనిపోయారు. మరో 15,558 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 19.98 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.38 కోట్లమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే కొనసాగుతున్నారు. దక్షిణ అమెరికాదేశాల్లో 6.83 కోట్లకుపైగా కరోనా కేసులుంటే వాటిలో 13.52 మరణాలునమోదయ్యాయి. మరో 10,160 కేసులు విషమపరిస్థితిలో ఉన్నట్లు తేలింది. రికవరీలు 6.64 కోట్లకుపైగా నమోదుకాగా మరో 5,73,924 మంది పరిస్థితి ఆందో ళనగా ఉన్నట్లు ఆదేశాలుప్రకటించాయి. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.28 కోట్లకుపైగా కరోనా కేసులుంటే వారిలో 2,58,662 మందిచని పోయారు. రికవరీలు 1.21 కోట్లకుపైగా నమోదుకాగా మరో 4,71, 412 మంది పరిస్థితి అయోమయంగా ఉంది. 19 ద్వీపకల్పదేశాల్లో మొత్తం 1.40 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 26,702 మంది చనిపోయారు. రికవరీలు 1.38 కోట్లకుపైబడ్డాయి. మరో 1,51,707 మంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనేకొనసాగుతూ వైరస్‌తో సతమతం అవుతున్నారు.



## వెంకన్న వసంతోత్సవాలకు నేడు అంకురార్పణ

### రేపటి నుంచి ప్రత్యేక ఉత్సవాలు, 4న ఉదయం స్వర్ణరథం

**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** వసంత రుతు వులో ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేలాగా ఆలయానికి పశ్చిమాన వసంతమండపంలో మూడురోజుల పాటు వసంతోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరగనుంది. ఇప్పటికే 300 రూపాయలు సేవా టిక్కెట్‌లను గృహస్థభక్తులకు ఆన్‌లైన్‌లో టిటిడి జారీచేసింది. సోమవారం నుంచి 5వతేదీ బుధవారం వరకు మూడురోజులపాటు అత్యంత వైభవంగా వసంతోత్సవాలు జరగనున్నాయి. రేపు ఉదయం 7గంటలకు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి నాలుగు మాఢవీధులలో ఊరేగుతూ వసంతమండపానికి చేరుకుంటారు. ఇక్కడ వసంతోత్సవ నివేదనలు పూర్తయిన తరువాత తిరిగి ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకుంటారు. రెండవరోజు 4వతేదీ ఉభయదేవేరులతోకలసి స్వామివారు ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాఢవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతమండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు 5వతేదీ శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామితో బాటు సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, రుక్మిణీ సమేత కృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగిసా యంత్రం ఆలయానికి చేరుకుంటారు. ఈ మూడురోజులు ప్రతిరోజూ మధ్యాహ్నాం 2గంటల నుంచి 4గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు పాలు,తేనె, పెరుగు, చందనం, పసుపు, కొబ్బరిజలంతో స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 6గంటల నుంచి 6.30గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వసంతోత్స వంలో వసంతమండపాన్ని సహజసిద్ధ ప్రకృతి వనంగా తీర్చిదిద్దడంతోబాటు సుగంధపుష్పాలు, పండ్లు నివేదిస్తారు.

ఈ ఉత్సవాలు సందర్భంగా ఎల్లుండి మంగళవారం అష్టదళపాదపద్మారాధన, సోమవారం నుండి 5వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

## 114 శ్లోకాలు 2గంటలు నిరంతరాయంగా బాలకాండ అఖండ పారాయణం

**తిరుమల,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** లోకకల్యాణం కోసం....ప్రపంచంలోని ప్రజల ఆయురారోగ్యం కోసం ఏడుకొండల్లోని నాదనీరాజనం వేదికపై శనివారం ఉదయం 15వ విడత బాలకాండ అఖండపారాయణం జరిగింది. కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తూ ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు బాలకాండలోని 71నుంచి 73వ సర్గల వరకు 89శ్లోకాలను, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రం కలిపి 25 శ్లోకాలు మొత్తం 114 శ్లోకాలను ఏకధాటిగా పారాయణం చేశారు. ఎస్వీవేదవిశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య రామకృష్ణసోమయాజి, ధర్మగిరి వేదపాఠశాల పండితులు కె.రామానుజాచార్యులు, అనంతకృష్ణసాయి,భక్తులు. పండితులు పాల్గొని బాలకాండ అఖండపారాయణంలో లీనమయ్యారు.

## తెలుగు రాష్ట్రాల మీదుగా సికింద్రాబాద్-తిరుమతిల మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, దక్షిణ మధ్య రైల్వే తెలుగు రాష్ట్రాలు, రాయలసీమ జిల్లాల మీదుగా సికింద్రాబాద్-తిరుపతి- సికింద్రాబాద్‌ల మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ నెల 07, 14 తేదీల్లో శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి తిరుపతికి బయల్దేరే నెంబర్ 07489 ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ నుంచి శుక్రవారం రాత్రి 8:10 గంటలకు బయల్దేరి శనివారం ఉదయం 9:00 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే నెంబర్ 07490 ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు ఈ నెల 9, 16 తేదీల్లో ఆదివారాల్లో సాయంత్రం 4:35 గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి సోమవారం ఉదయం 6:25 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైల్లుమార్గ మధ్యంలో కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తిరోడ్, గద్వాల, కర్నూలు, ద్రోణాచలం(డోన్), గుత్తి, తాడిపత్రి ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట రైల్వే స్టేషన్లలో నిలుస్తాయి.

## పలు రైళ్లకు అదనపు బోగీలు

**గుంతకల్లు రైల్వే, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ప్రస్తుత వేసవి సీజన్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపారు. విజయవాడ నుంచి లింగంపల్లి వెళ్లే నెంబర్ 12795 ఇంటర్ సిటి ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 01 నుంచి 30 వరకు, లింగంపల్లి నుంచి విజయవాడ వెళ్లే నెంబర్ 12796 ఇంటర్ సిటీ ఎక్ ప్రెస్ రైళ్లకు ఏప్రిల్ 02 నుంచి మే 01 వరకు అదనంగా మరో ఎసి చైర్ కార్ బోగీని ఏర్పాటు చేశారు. అలాగే తిరుపతి నుంచి పూరి వెళ్లే నెంబర్ 17480 ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 01 నుంచి 15 వరకు, పూరి నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 17479 పూరి ఎక్స్ ప్రెస్‌కు ఏప్రిల్ 03 నుంచి 17 వరకు, తిరుపతి నుంచి బిలాస్‌పూర్ వెళ్లే నెంబర్ 17482ఎక్స్ ప్రెస్‌కు ఏప్రిల్ 2 నుంచి 16 వరకు, బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 17481 బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 04 నుంచి 18 వరకు అదనంగా మరొక స్లీపర్ క్లాస్ బోగీలను ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

## సత్యకుమార్‌పై దాడి ముందస్తు వ్యూహాం: సోము వీర్రాజు



**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ నేత సత్యకుమార్‌పై దాడి వ్యవహారం ఒక కుట్ర పూరితమైన ముందస్తు వ్యూహమని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆరోపించారు.ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఇది ప్రభుత్వ పిరికి చర్య అన్నారు.ఇందుకు వైకాంగ్రెస పార్టీ గట్టి మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు.1200 రోజుల రైతుల ఉద్యమానికి మద్దతుగా తమ పార్టీ నాయకుడు సత్యకుమార్ అమరావతి వెళ్ళి వస్తున్న సందర్భంలో ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం పోలీసుల సమక్షంలో వైకాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు దాడి చేసారన్నారు.సత్యకుమార్ ప్రయాణం చేస్తున్న కారు అద్దాలు ధ్వంసం చేసారన్నారు.ఆయనపై దాడికి పాల్పడ్డారన్నారు. ఆయనతో ఉన్న సురేష్, యాదవ్ అనే వ్యక్తులపై విచక్షణా రహితంగా కొట్టారన్నారు.పోలీసుల నిర్లక్ష్యంతోనే ఈ దాడి జరిగిందని ఆరోపిం చారు.ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యల తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతా మన్నారు.ఈ ఘటనలో ఎవరెవరు ఉన్నారో స్పష్టంగా పేర్కొన్నారు.ఈ ఘటనను తమ పార్టీ ఖండిస్తుందన్నారు.ఈ రోజున రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ, నగర, మండల, జిల్లా కేంద్రాల్లో తమ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాజధానిగా అమరావతిగా ఉండాలనే అంశంపై తమ పార్టీ మొదటినుంచి ఒకే స్టాండ్‌పై ఉంద న్నారు. సత్యకుమార్‌పై దాడిని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బిజెపిశ్రేణులు ఆందోళన నిర్వహించాయి.



## యువతకు భరోసా యువగళం పాదయాత్ర

**అనంతపురం, ఏప్రిల్ 1ప్రభాతవార్త బ్యూరో :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాడని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తీవ్రంగా మండి పడ్డారు. శనివారం ఆయన అనంతపురంలో విలేకర్లతో మాట్లాడుతూ జగన్ తన ఎన్నికల మేనిఫె స్టోలో 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి దారుణంగా మోసం చేశాడన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో జగన్ తొలి మూడేళ్ల పాలనలో 21,575 మంది యువత బలవన్మరణానికి పాల్పడ్డారని, ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో 571 మంది యువతి, యువకులు మత్తు పదార్థాలకు బానిసలై ప్రాణాలు పోగొట్టుకున్నారని, ఎన్‌సియర్‌బి నివేదిక స్పష్టం చేసిందన్నారు. తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో దాదాపు ఆరు లక్షల మందికి నిరుద్యోగ భృతిని ఇచ్చామని గుర్తు చేశారు.అలాగే 5.71 లక్షల మందికి ఉద్యోగాఅవకాశాలు కల్పించినట్లు స్వయంగా అసెంబ్లీ, వైసీపీ ప్రభుత్వమే ఒప్పుకుందన్నారు. రాష్ట్రంలో యువతకు మంచిరోజులు రావాలన్నా, పరిశ్రమలు ఏర్పాటు కావాలన్నా, సాగునీటిప్రాజెక్టులు పూర్తి కావాలన్నా, వ్యవసాయం బతికి బట్టకట్టాలన్నా ఒక్క చంద్రబాబునాయుడు పాలనతోనే సాధ్యమని ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు తెలిపారు.

# వేణుగానాలంకారంలో శ్రీరామచంద్రమూర్తి

### అలరించిన కోలాటాలు

**ఒంటిమిట్ట, ఏప్రిల్1ప్రభాతవార్త:** ఒంటిమిట్టలోని కోదండరామస్వామి బ్రహ్మోత్సల్లో బాగంగా రెండో రోజు శనివారం ఉదయం వేణుగానాలంకారంలో స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీదుల్లో భక్తులకు ఆభయమిచ్చారు. ఉదయం 8 గంటలనుండి స్వామివారి ఊరేగింపు వైభవంగాజరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిసుండగా మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు ఆడుగడుగునా కర్పూర హారతులు సమర్పించిస్వామివారిని దర్శించుకున్నరు. ఉదయం 7గంటలనుండి12 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు.ఇందులో పాలు ,పేరుగు,తేనె,చందనం తోస్వామి అమ్మవార్లకు అభిషేకం చేశారు. సాయంత్రం 5గంటలనుండి 6 గంటలవరకు ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు,వెంకటేశ్వయ్య, సుబ్రమణ్యం,ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

**సంజీవని తెచ్చిన సంజీవరాయుడు** ఒంటిమిట్టలోని శ్రీ ఆంజనేయస్వామివారు సంజీవరాయుడుగా భక్తులకు దర్శనంఇస్తున్నరు. సంజీవరాయుని ఆలయ పురాణ ప్రాశస్త్యం ఆలా వుంది.ఒంటిమిట్ట గుడిలో సీతలక్ష్మణులు ఇరువైపులా ఉండగా కోదండం ధరించి శ్రీరామచంద్రుడు దర్శనం ఇస్తారు. ఇది ఆరణ్య వాస కాలంనాటి దృశ్యం.అప్పటికి ఇంకా శ్రీరామచంద్రుని దర్శంనం హనుమంతునికి కాలేదు.ఈ కారణం చేతనే ఒంటిమిట్ట గుడిలో ఆంజనేయస్వామి లేదంటారు.రామాలయం ఆంటే భూమికి దిగిన వైకుంఠం అని రాముని బంటును కావున ఎదురుగా ఉండి సేవ చేసేకుంటానని, ఆంజనేయస్వామి చెప్పినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. అందుకే ఒంటిమిట్ట గుడికి ఎదురుగా సంజీవరాయుడుగా కొలువుదీరి ఉన్నడు. రామరావణ యుద్ధంలో వానరులు మరణించినప్పుడు లక్ష్మణుడు మూర్తపోయినప్పుడు రెండు సార్లు హిమాలయ పర్వతాలు దాటి మహేంద్రగిరికి వెళ్ళి నాలుగు రకాల సంజీవని మూలికలను ఆంజనేయుడు తెచ్చినట్టు పురాణ కధనం. కావున ఇక్కడి స్వామివారికి సంజీవరాయుడని పేరు వచ్చింది. చెరువు కట్ట మీద కూడా ఆంజనేయస్వామి వారు కొలువై ఉన్నరు. నీటి వల్లగాని, వరిపోలాల్లో తిరుగుతున్నప్పుడు గానీ ప్రాణభయం కలుగకుండా ఈ ఆంజనేయస్వామికాపాడతారని భక్తుల నమ్మకం. ఇక్కడి స్వామి వారు శారీరక మానసిక రోగాలు పోగోడుతూ భక్తులను ఆనుగ్రహిస్తున్నారు.



శనివారం గ్రామోత్సవంలో కోదండరాముడు

## ప్రభుత్వ సహకారంతో చేనేత కార్మికుల సర్వతోముఖాభివృద్ధి

### ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో చేనేత కార్మికుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ఆప్కో తన పయనం సాగిస్తుందని సంస్థ ఛైర్మన్ గంజి చిరంజీవి అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘం(ఆప్కో) 38వ సర్వసభ్య సమావేశం రాయల్ కన్వెన్షన్‌లో శనివారం జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి ఆయా చేనేత సహకార సంఘాల ప్రతినిధులు భారీగా ఈ సమావేశానికి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో గంజి చిరంజీవి ఈ సమావేశాన్ని ప్రారంభించారు.సమావేశంలో విభిన్న అంశాలపై లోతుగా చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు.ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మానస పుత్రికగా అందిస్తున్న నేతన్న నేస్తం పథకం వేలాది మంది చేనేత కార్మికుల జీవితాలతో వెలుగు ప్రసాదించిందన్నారు.కార్మికుల డిమాండ్ మేరకు రాయితీ నూలును సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామన్నారు.ప్రస్తుత ఆర్ధిక సంవత్సరం ప్రారంభం నుండి సంఘాలరే బకాయిలు లేకుండా చూసేందుకు నూతన విధానానికి అంకురార్పణ చేయనున్నామన్నారు.పవర్‌లూమ్స్ పోటీని తట్టుకునేలా ఆధునీకతకు అద్దం పడుతూ నూతన డిజైన్లు వినియోగదారులకు అందించాల్సివుందన్నారు. ఆప్కో ఎండి ఎంఎం నాయక్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలనే డిమాండ్ చేస్తూ సభ్యులు ఏక గ్రీవ తీర్మానం చేసారని తెలిపారు.ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి,ఎండి ఎంఎం నాయక్‌లు వివిధ కారణాలతో మృతి చెందిన చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.12,500ల చొప్పున పరిహారం చెక్కులు అందజేసారు.ఆప్కో డైరెక్టర్ ఎల్లా సుబ్బారాయుడు,చేనేత జౌళి శాఖ సంయుక్త సంచాలకులు మైసూరు నాగేశ్వరరావు,కన్నబాబు,ఆప్కో జనరల్ మేనేజర్ తనుజా రాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆప్కో సర్వసభ్య సమావేశ ప్రారంభ కార్యక్రమంలో ఆ సంస్థ ఛైర్మన్ గంజి చిరంజీవి, ఎండి నాయక్

## గుంటూరు బార్ అధ్యక్షుడిగా సురేష్

### అధికారపార్టీ అభ్యర్థులకు చుక్కెదురు
### ఆదిలక్ష్మికి భారీ ఓటింగ్
### వంశీకి అత్యధిక మెజార్టీ



అధ్యక్షుడు కె.వి.కె.సురేష్,ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కార్యదర్శి నైనా షేక్. మహిళా కార్యదర్శి స్వాతి

**గుంటూరు లీగల్,ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ లను కైవశం చేసుకున్న పరంపరలో రాష్ట్రంలో పలు ప్రతిష్టాత్మ కమైన సంస్థల ప్రతినిధులను కూడా తమ ఖాతాలో జమచేసు కుంటుంది.రాష్ట్రంలోనే సుదీర్ఘ చరిత్రగల్గిన గుంటూరు బార్ అసో సియేషన్‌కు 2023-24సంవత్సరానికి గాను శుక్రవారం ఎన్నికలు జరగ్గా కౌంటింగ్ ప్రక్రియ శనివారం ఉదయం 6గంటలకు ముగి సింది.అధ్యక్ష పదవికి హోరాహోరీగా జరిగిన పోరులో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.వి.కె.సురేష్ దశాబ్ది అధ్యక్షుడిగా విజయం సొంతం చేసుకున్నారు.సురేష్ గుంటూరు బార్ అసోసియేషన్‌కు నూరవ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.పలు పదవులకు పోటీచేసిన వైసీపీ మద్దతుదారులు పరాజయం చవి చూశారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల అధికారుల, కార్యవర్గం అవగాహన రాహిత్యం వలన రాత్రి 10గంటల తర్వాత కౌంటింగ్ మొదలైంది.అభ్యర్థులు కౌంటింగ్ విధానంపై ఆందోళన వ్యక్తం చేయడంతో పలుసార్లు ఎన్నికల అధికారి శామ్యూల్ జాన్ కౌంటింగ్ ప్రక్రియ నిలిపివేస్తానని హెచ్చరించారు.తదనంతర పరిణామాల నేపధ్యంలో గుంటూరు బార్ సీనియర్ న్యాయవాదులు గాదె వెంకటేశ్వరరావు, ముమ్మనేని సతీష్, శ్రీకాంత్,ఏడుకొండలు తదితరులు కౌంటింగ్ ప్రక్రియను తమ చేతుల్లోకి తీసుకొని విజయవంతంగా ముగించారు.అధ్యక్ష పదవికి తొలిరౌండు నుండి నువ్వా..నేనా అన్నట్లు తీవ్ర ఉత్కంఠ నెలకొంది ఎట్టకేలకు యువ న్యాయవాది కె.వి.కె సురేష్ 35ఓట్ల మెజార్టీతో బార్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.సురేష్‌కు 769ఓట్లు పోలవ్వగా,సమీప ప్రత్యర్థి కాసు వెంకటరెడ్డికి 734ఓట్లు లభించాయి.మంగళపురి శ్రీనివాసరావుకు 57ఓట్లు,తోట సంగమేశ్వరరావుకు 18ఓట్లు మాత్రమే లభించాయి. బార్ అసోసియేషన్‌లో ప్రధాన పదవులైన ఉపాధ్యక్ష పదవికి దాసరి ఉమామహేశ్వరరావు 141ఓట్లు మెజార్టీతో (752) గెలుపొందారు.ప్రత్యర్థి బి.వి.గౌరీశంకర్(611),డాక్టర్ చింతా రామకోటి (194) ఓట్లు సాధించారు.ప్రధాన కార్యదర్శి పదవికి పోటీచేసిన ఆర్.ఎన్.వంశీకృష్ణ విజయం ముందే ఊహించినట్లు 432ఓట్ల భారీ మెజార్టీతో (835) విజయం కైవశం చేసుకున్నారు.ప్రత్యర్థులు కంచర్ల బాబు403, మల్లెంపాటి సురేంద్రబాబు 309ఓట్లు లభించాయి.కోశాధికారి పదవికి జి.విజయ రాజ కుమార్(686) 225ఓట్లు మెజార్టీతో సమీప ప్రత్యర్థి యారం తిరుపతయ్య (461)పై గెలుపొందారు.మరో ప్రత ్యర్థి పి.ఎస్‌ప్రసాద్‌కు 380ఓట్లు లభించాయి.బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా షేక్ నైనా,మహిళా కార్యదర్శిగా మద్దుర్తి స్వాతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గ్రంధాలయ కార్యదర్శి పదవికి గేరా శ్యామ్ రత్నరాజ (680) 205ఓట్ల మెజార్టీతో వి.దినేష్(475) పై గెలుపొందారు. మరో పోటీదారుడు ఐ.విజయవర్మ 299 ఓట్లు సాధించారు.క్రీడా సాంస్కృతిక కార్యదర్శి పదవికి గాలి అశోక్ ఆనంద్ (765) 94 ఓట్ల మెజార్టీతో సయ్యద్ ఇస్మాయిల్ (671)పై గెలుపొందారు.మహిళా కార్యవర్గ సభ్యురాలి పదవికి పరుచూరు కుమారినంద(738) ఓట్లు సాధించి ప్రత్యర్థి పులి ప్రత్యూషపై (736) కేవలం రెండే ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.ఈ పదవికి రీ-కౌంటింగ్ చేపట్టాలని ప్రత్యూష పట్టుబట్టినప్పటికీ ఎన్నికల అధికారి శామ్యూల్‌జాన్ నిరాకరించారు.నాలుగు సీనియర్ కార్యవర్గ సభ్యుల పదవులకు మాదల ఆదిలక్ష్మీ 837 ఓట్లు సాధించి ఈ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించిన న్యాయవాదిగా తొలి స్థానం కైవశం చేసుకున్నారు. గుర జాల అనురాధ 728, జి.విజయ్‌కుమార్ 688,పారి బాబురావు 602 ఓట్లు సాధించి సీనియర్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక య్యారు.పోటీ చేసిన మరో అభ్యర్థి మహ్మద్ దాదా కరీమ్‌కు 547 ఓట్లు మాత్రమే లభించడంతో కార్యవర్గంలోనికి రాలేకపోయారు. మూడు జూనియర్ కార్యవర్గ సభ్యుల పదవులకు పూదోట రాజేష్ లింగమ్ 769,రాయపూడి శ్రీనివాసరావు 581,గౌరవనేని శ్రీలక్ష్మీ 511,ఓట్లు సాధించి కార్యవర్గానికి ఎన్నికయ్యారు.లింగాల మారుతీ శివనాగ ప్రసాద్‌కు 501, జి.బిల్లిగ్రాహమ్ ఇసాక్ 407మాత్రమే లభించాలయి.ఆధ్యంతం ప్రతి పదవి కౌంటింగ్‌లో తీవ్ర ఉత ్కంఠ నెలకొంది.ఎన్నికలు న్యాయవాదుల మధ్య జరిగినప్పటికీ అధికార ప్రతిపక్ష రాజకీయ పక్షాల పోరుగానే కొనసాగింది. సాదారణంగా బార్ అసోసియేషన్‌లో ఓటు వేసేందుకు అరుదుగా వచ్చే మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఈ ఏడాది తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.మరో మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు,చుక్కా ఏసురత్నం,చుక్కపల్లి రమేష్,శ్రీరామ్ రాజీవ్ ఆనంద్ తదితర తెలుగుదేశం నాయకులు సురేష్ గెలు పొందేందుకు తమ

## ముక్కంటీశుని ఆలయంలో రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. అంతేకాక శనివారం కావటంతో శనీశ్వరుని ఆలయం వద్ద , అభయ వెం కటే శ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల కాలంలో శ్రీకాళహస్తీశ్వరాలయం లో భక్తుల రద్దీ పెరిగింది. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిధులతో కళ కళ లాడింది.

నాలుగైదు రోజులుగా పరిమితంగా ఉన్న భక్తుల సంఖ్య శనివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

## తొలిరోజే దివ్యదర్శనం టోకెన్లకు విశేష స్పందన

### నాలుగుగంటల్లో 15వేల టోకెన్లు జారీ



**తిరుమల,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** దాదాపు మూడుసంవత్సరాల తరువాత కాలినడక భక్తులకు పునరుద్ధరించిన "దివ్యదర్శనమ్"టోకెన్లు జారీచేసిన తొలిరోజు శనివారం విశేష స్పందన లభించింది. 15వేల దర్శన టోకెన్లలో ఉదయం 11గంటలసమయానికి 12వేల టోకెన్లు కాలినడక భక్తులు అందుకోవడం విశేషం. శ్రీవారిమెట్లుమార్గంలో మిగిలిన 3వేల స్లాట్ టోకెన్లు సాయంత్రం 3గంటలకు పూర్తిగా భక్తులకు కేటాయించేశారు. తొలిరోజు తిరుపతి అలిపిరి మెట్ల మార్గంలో తెల్లవారుజామున 3గంటల నుంచి మొదలుపెట్టిన 10వేల టోకెన్లు ఉదయం 11గంటలకల్లా పూర్తిగా జారీ అయ్యాయి. శ్రీవారిమెట్లు కాలినడక మార్గంలో 5వేల టోకెన్లుకు ఉదయం 6గంటల నుంచి మొదలుపెట్టిన టోకెన్లను ఉదయం 11గంటలకు 2వేల టోకెన్లు కాలినడక భక్తులు అందుకున్నారు. మొక్కుబడుల్లో భాగంగా కాలినడకన వచ్చిన భక్తులకు ఎలాంటి దర్శన టిక్కెట్లు, ఎస్ఎస్‌డి స్లాట్ టోకెన్లు లేనివారికే ఆధార్‌కార్డు ఆధారంగా ఈ దివ్యదర్శనమ్ స్లాట్ టోకెన్లు అందుకునేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. దివ్యదర్శనమ్ టోకెన్లు కలిగిన భక్తులకు కూడా ఒక ఉచిత లడ్డూ అందుకునే వెసలుబాటు కల్పించారు.అలిపిరి మార్గంలో గాలిగోపురం వద్ద 10వేలు, శ్రీవారి మెట్లు మార్గంలో 1250వ మెట్టు వద్ద 5వేల టోకెన్లు విడుదల చేస్తారు. తిరుపతి అలిపిరి కాలినడక మార్గం 24గంటలూ తెరచి భక్తులను అనుమతి నిస్తున్నారు. దీంతో భక్తులు దాదాపు ఈ మార్గంలోనే అధికంగా కొండకు చేరుకుంటారు. ఇక దగ్గర సులభ మార్గమైన శ్రీవారిమెట్లు మార్గం ఉదయం 6గంటలకు తెరచి సాయం త్రం 5.30గంటలకు మూసివేస్తారు. ఈ మార్గంలో తక్కువమంది భక్తులు నడచి తిరుమలకు వస్తారు. ఇవన్నీ పరిశీలించి టిటిడి 15వేల టోకెన్లు జారీ చేస్తోంది. కాలినడక భక్తులు తమ ఆధార్‌కార్డు వెంట తీసుకువచ్చి ఈ టోకెన్లు అందుకుని ఏటిసి కారుపార్కింగ్ సమీపంలోని కాలినడక కాంప్లెక్స్‌నుంచి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ 1 లోనికి ప్రవేశించి సాఫీగా, త్వరితగతిన సులభంగా ఇష్టదైవమ్ దర్శనం చేసుకునేలా చూడాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## రూ.80 కోట్లు డ్వాక్రా రుణమాఫీచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్: ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

**రాజవొమ్మంగి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతూ అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలో రూ. 80 కోట్లు డ్వాక్రా రుణమాఫీని అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రాజవొమ్మంగి అల్లూరి సీతారామరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల మహిళా సమైఖ్య అద్యక్షురాలు కొనకం వరలక్ష్మి అద్యక్షతన వైయస్ఆర్ ఆసరా మూడో విడత కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముందుగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లోకి వెళ్ళి ఓటు వేయమని అడిగే హక్కును టిడిపి పార్టీ ఎప్పుడో కోల్పోయిందని అన్నారు. 25 యేళ్ళ పాటు నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించకుండానే నిధులు కాజేసారని అన్నారు. టిడిపి మేనిఫేస్టోలో 500హామీలు చెప్పి 5హామీలను కూడా అమలు చేయలేదన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, సొసైటీ ఛైర్మన్ శింగిరెడ్డి రామకృష్ణ, యంపిడిఓ కోసు బాపన్నదొర, వెలుగు డిపియం పరమేష్, తహశీల్దారు వై.వి.సుబ్రమణ్యాచారి, యంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్‌పిటిసి వడుగుల జ్యోతి, దాట్ల వెంకటేష్‌రాజు, వైస్ యంపిపిలు సప్పా సత్యచంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, మండల కోఆప్షన్ సభ్యులు అడపా కామేశ్వరరావు,, యంపిటిసిలు నిర్మలాదేవి, కానెం అచ్చియ్యమ్మ, సర్పంచులు కె.మురళీకృష్ణ,చీడి శివ, బీమిరెడ్డి సుబ్బలక్ష్మి, దాసరి నాగేశ్వరరావు, కించు వెంకటలక్ష్మి, తొంటా ఆదిరాజు, బూసరి సత్యానారాయణ, మండల సమైఖ్య లీడర్లు వరలక్ష్మి, లింగమ్మ, బొడ్డు వెంకటరమణ, చీడిపల్లి అప్పారావు, కుశరాజు, శింగిరెడ్డి రవి, వెలుగు ఏపియం ఆదినారాయణ, సిసిలు, భారీ ఎత్తున మహిళలు పాల్గొన్నారు. రాజవొమ్మంగి సిఐ బాజీలాల్ పర్యవేక్షణలో 50 మంది పోలీసులు విధులను నిర్వహించారు.




శనివారం రాజవొమ్మంగిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



## హంస వాహనంపై దర్శనం ఇచ్చిన జానకిరాముడు

**ఒంటిమిటఏప్రిల్1ప్రబాతవార్త:** ఒంటిమిట్ట కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన శనివారం రాత్రి హంసవాహనంపై సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి 7గంటలనుంచి భజన బృందాలు కోలాటాల నడుమ పురవీదులో వాహనసేవ జరిగింది.పురవీదుల్లో వాహన పేవ కోలాహాలంగా జరిగింది.భక్తులు ఆడుగడుగునా కార్పురహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆత్మానాత్మ వివేకం కలవానికి భగవదనుగ్రహం సంపూర్ణంగా కలుగుతుంది.హంస వాహనంలోని పరమార్ధం ఇదే.హంసలో పాలను నీళ్లను వేరుచేసి సామర్ధ్యం ఉంది. సోహం భావం కలిగిన భక్తులలో ఆహంభావం తొలిగించి దాసోహం ఆనే భావం కలిగించడానికే పరమహంస రూపారికి ప్రతీక ఆయిన హంస వాహనాన్ని స్వామివారు ఆదిరోహిస్తారు. గ్రామెత్సవంలో దారిపోడువునా చిన్నారు, మహిళలు, వృద్ధులు కోలాటాలు నిర్వహించారు. ఇవి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేస్‌బాబు, ఆదికారులు వెంకటేషయ్య, సుబ్రమణ్యం, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## అక్రిటిడేషన్ కమిటీల్లో ఎపిడబ్ల్యూజెఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలి

**విశాఖపట్నం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లను జారీ చేసే కమిటీలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లను జారీ చేసే కమిటీలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు విశాఖపట్నం జిల్లా అద్యక్షులు పి.నారాయణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం విడిపోయిన నాటి నుంచి ఏర్పాటైన కమిటీలలో ఏపీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఉందని అతిపెద్ద సంఘంగా రాష్ట్రంలో వేలమంది సభ్యులతో అన్ని జిల్లా కమిటీలతో ఫెడరేషన్ పని చేస్తోందన్నారు.

జర్నలిస్టులకు అక్రడిటేషన్లు జారీ చేసే కమిటీలో జర్నలిస్టు సంఘం ప్రాధాన్యం ఉండడం తప్పని సరని భావిస్తున్నామని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం పునారాలోచన చేయాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# స్పేస్ సెటిల్‌మెంట్ డిజైన్ కాంటెస్ట్‌లో 76 ప్రాజెక్టులతో గ్లోబల్ లీడర్‌గా అవతరించిన నారాయణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్1:** నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెరార్డ్ కె.ఓ నీల్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ 2021-23 లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. వరల్డ్ నెం.1 స్థానంలో 6 సెలక్షన్స్ నారాయణ విద్యార్థులు దక్కించుకోగా,వరల్ నెం.2 స్థానంలో 14,వరల్డ్ నెం.3 స్థానంలో 30 సెలక్షన్స్‌తో పాటు 26 హానరబుల్ ప్రైజ్‌లను నారాయణ విద్యార్థులు కైవశం చేసుకున్నారని నారాయణ విద్యా సంస్థలను మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ సింధూర నారాయణ, శరణి నారాయణ పేర్కొన్నారు. మొత్తంగా 76 ప్రాజెక్టుల్లో విజయకేతనం ఎగురవేసినట్లు తెలిపారు. ఈ ఘన విజయంతో రాష్ట్ర స్థాయిలోనే కాకుండా,జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ నారాయణ విద్యార్థుల విజయ ప్రస్తానం అప్రతిహతంగా కొనసాగుతోందన్నారు. గత 10 సంవత్సరాలుగా అద్భుత ఫలితాలు సాధిస్తూ ఇప్పటి వరకు 300లకు పైగా ప్రాజెక్టులు గెలుచుకుని వరల్డ్ నెం.1 స్కూల్‌గా నారాయణ మళ్లీ తనను తాను నిరూపించుకుందని తెలియ జేశారు. నేషనల్ స్పేస్ సొసైటీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ కాంటెస్ట్‌లో ప్రపంచ వ్యాప్తంగా వేలాది విద్యా సంస్థల నుంచి వందలాది ప్రాజెక్టులతో ఈ కాంపిటీషన్‌లో పాల్గొంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా ప్రోగ్రామ్స్‌ను అమలు పరుస్తూ ఏకైక స్కూల్ నారాయణ మాత్రమే అన్నారు. దీని కోసం సిఓ స్పార్క్,ఒలింపియాడ్,ఈ-టెక్నో,మెడిస్పార్క్ వంటి ప్రోగ్రామ్స్‌తో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ ప్రోగ్రామ్స్ కోసం ప్రత్యేకంగా అత్యున్నత స్థాయి మెటీరియల్‌ను రూపొందించామన్నారు. దీని ద్వారా రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో సింహభాగం నారాయణ విద్యార్థులు విజయం సాధించటం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా నాసా లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ నిర్వహించే కాంటెస్ట్‌కు సృజనాత్మకతో కూడిన నూతన ఆవిష్కరణలు చేయాల్సి ఉంటుందన్నారు. దీని కోసం ఎంతగానో శ్రమించాల్సి ఉంటుం దన్నారు. కనుకే క్లాస్‌రూమ్‌లో బోధించేటప్పుడే ప్రతి అంశంపై విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తిం చేలా,విశ్లేషించుకునేలా, నూతన ఆవిష్కరణల వైపు ప్రేరేపించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలలో నారాయణ విద్యార్థులు సాధిస్తున్న నిరంతర ఘన విజయాలు వెనుక నారాయణ సుపీరియర్ ప్లానింగ్, సూపర్లేటివ్ టీచింగ్ వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా సిబిఎస్ఈతో కూడిన ఇంటిగ్రేటెడ్ కరిక్యులమ్‌ను ప్రవేశపెట్టి, విద్యను అందించటం వలనే ఇలాంటి ఎన్నో అద్భుత ఫలితాలు వెలువెడుతున్నాని పేర్కొన్నారు. ప్రాథమిక దశ నుంచే శాస్త్ర,సాంకేతిక అంశాలపై పరిజ్ఞానం పెంచుకోవటంతో పాటు,నూతన ఆవిష్కరణలు కనుగొనే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా ఘన విజయం సాధిం చిన విద్యార్థులను నారాయణ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.



స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా,రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత, కేంద్ర రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ఆర్ అండ్ డి మరియు చైర్మన్ డిఆర్‌డివో డా.జి.సతీష్ రెడ్డి

## శ్రీ శోభకృత్ చైత్రమాస బ్రహ్మోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో శ్రీ శోభకృత్ నామ సంవత్సర చైత్రశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి (1 నుండి 5వ తేదీ) వరకు నిర్వహించే బ్రహోత్స వాల్లో భాగంగా చైత్రమాస బ్రహ్మోత్స వాల్లో మొదటి రోజున శనివారం ఉదయం 8 గంటలకు బాలాలయంలో శ్రీ గంగా దుర్గామల్లేశ్వర స్వామివార్లకు శాస్త్రోక్తంగా మంగళ స్నానములాచరిం పచేసి అనంతరం వధూవరులుగా అలంకరించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ ఈవో దర్భముళ్ల భ్రమరాంబ, ట్రస్టుబోర్డు సభ్యులు బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ నిడమానూరి కళ్యాణి పాల్గొనగా, చైర్మన్ దంపతులు, ఆలయ ఈవో స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం 4 గంటలకు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారికి పూజ, పుణ్యాహవాచనము, అంకురార్పణ, అఖండదీప స్థాపన, కలశారాధన, బలిహరణ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు మల్లిఖార్జున మహామండపం నుండి శ్రీ స్వామి అమ్మవార్ల వెండి పల్లకి సేవ నిర్వహించడమైనది.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనార్థం కేంద్ర రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ఆర్ అండ్ డి మరియు చైర్మన్ డిఆర్‌డివో డా.జి సతీష్ రెడ్డి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబ సభ్యులు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా కుటుంబ సభ్యులు రాగా ఆలయ మర్యాదలతో వారిని స్వాగతించి, శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదము, శేషవస్త్రము అందచేశారు.

**నిత్యాన్నదాన పథక విరాళాలు :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిత్యము నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాదుకు చెందిన సిహెచ్ నాగార్జున రూ.1,01,116/-లు విరాళాన్ని ఆలయ అధికారులకు అందచేశారు. దాతలకు శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదము, శేషవస్త్రము అందచేశారు.



ఆలయాధికారులకు అన్నదాన విరాళం అందిస్తున్న దాతలు

# ఢిల్లీకేపిటల్స్‌పై లక్నో సూపర్‌జెయింట్స్ గెలుపు

### 50 పరుగుల భారీ తేడాతో ఢిల్లీ జట్టు ఓటమి
### కెప్టెన్‌గా డేవిడ్ వార్నర్ అర్ధసెంచరీ



**లక్నో:** ఐపిఎల్ 2023 సీజన్‌లోమూడో మ్యాచ్ రసవత్తరంగా ముగిసింది. ఢిల్లీ కేపిటల్స్‌పై లక్నో సూపర్‌జెయింట్స్ 50 పరుగుల భారీ తేడాతో గెలిచింది. సొంతగడ్డపై మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ ఎంచుకున్న లక్నో టీమ్ మొదటి మ్యాచ్‌తోనే చెలరేగారు. ఓపెనర్ కేల్ మేయర్స్ 38 బంతుల్లో రెండుఫోర్లు, ఏడు సిక్స్‌లతో 73 పరుగులుచేసి విధ్వంసం సృష్టించాడు. మొత్తం 193 పరుగులుచేసింది. మేయర్స్‌తోపాటు చివరిలో నికొలస్ పూరన్ 21 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్స్‌లతోకలిపి మొత్తం 36 పరుగులుచేసాడు. ఢిల్లీ కేపిటల్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్, చేతన్‌సకారియారెండేసి వికెట్లు తీస్తే అక్షర్‌పటేల్, కుల్దీప్‌యాదవ్‌లు చెరో వికెట్ తీసారు. మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ కేపిటల్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఫీల్డింగ్‌ఎం చుకున్నాడు. దాంతో కేల్‌మేయర్స్‌తోకలిసి లక్నో ఇన్నింగ్స్‌ని కెప్టెన్ కెఎల్‌రాహుల్ 12 బంతుల్లో ఎనిమిదిపరుగులుచేసాడు. కానీ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఆతని తర్వాత వచ్చిన దీపక్‌హుడా 17, మార్కస్ స్టొయినిస్ 12 పరుగులతో తక్కువ స్కోరుకే ఔట్ అయ్యారు. కానీ చివరిలో ఆయుష్ బదౌని ఏడు బంతుల్లో ఒక ఫోరు, రెండుసిక్స్‌లతో 18 పరుగులుచేసాడు. చివరి బంతికి ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన కృష్ణప్ప గౌతమ్ సిక్స్‌తో ఇన్నింగ్స్ ముగించాడు. దాంతో లక్నో జట్టు ఆరువికెట్ల నష్టానికి 193 పరుగులుచేసింది. ఢిల్లీకేపిటల్స్‌కు 194 పరుగులు లక్ష్యం విధించింది. తర్వాత లక్ష్యఛేదనలో ఢిల్లీకేపిటల్స్ కెప్టెన్ వార్నర్ 48 బంతుల్లో 56 పరుగులుచేసాడు. ఏడుఫోర్లుకూడా ఉన్నాయి. అర్ధసెంచరీతో సత్తాచూపించాడు. రిలీ రస్సో 20 బంతుల్లో 30 పరుగులుచేసి రాణించాడు.చివరిలో అక్షర్‌పటేల్ మెరుపులు మెరిపించినా అప్పటికే జాప్యం జరిగిపోయింది పృథ్వీషా 12, మిచెల్‌మార్స్ (0)సర్ఫరాజ్‌ఖాన్ నాలుగుపరుగులతో నిరాశపరిచారు. లక్నో బౌలర్లలో మార్క్‌వుడ్ నాలుగు ఓవర్లలో కేవలం 14 పరుగులుమాత్రమే ఇచ్చి ఐదు వికెట్లుతో దుమ్మురేపాడు. ఆవేష్‌ఖాన్, రవిబిష్ణోయ్‌చెరో రెండు వికెట్లతో సత్తాచాటారు. మొదటి నాలుగు ఓవర్లలో ఢిల్లీజట్టు దూకుడుగా ఆడింది. వార్నర్; పృథ్వీషా బౌండరీలతో స్కోరుబోర్డు పరుగులు తీసింది. ఇంగ్లండ్ స్టార్‌బౌలర్ మార్క్‌వుడ్ రాకతో ఇన్నింగ్స్ స్వరూపమే ఒక్కసారిగా మారిపోయింది. వరుసబంతుల్లో పృథ్వీషా, మిచెల్‌హార్స్‌ను ఔట్‌చేసి కోలుకోలేని దెబ్బతీసాడు. కాసేపటికే సర్ఫరాజ్‌ఖాన్‌కూడా ఔట్ అయి ఢిల్లీకి మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టాడు. రిలీరసో కాసేపు మెరిసాడు. కానీ రవిబిష్ణోయ్ ఢిల్లీ కేపిటల్స్‌ను దెబ్బతీసాడు. రిలీ రస్సో,పావెల్‌ను స్వల్పవిరామాల్లో ఔట్ చేసాడు. దీనితో 94 పరుగులకే ఐదు వికెట్లు నష్టపోయిన ఢిల్లీ జట్టు వీలు చిక్కినపుడల్లా బౌండరీలు బాదుతూ వార్నర్ జట్టుకు ఉత్తేజం తెచ్చాడు. ఈక్రమంలోనే అర్ధసెంచరీ పూర్తిచేసాడు. అర్ధసెంచరీతర్వాత వార్నర్ ఔట్ కావడంతో ఢిల్లీకి ఓటమి తప్పలేదు. చివరిలో అక్షర్‌పటేల్‌మెరుపులు మెరిపించినా ఫలితం లేకపోయింది. చివరి ఓవర్‌లోమరో రెండు వికెట్లు తీసి మార్క్‌వుడ్ ఐదు వికెట్లతో స్టార్‌గా నిలిచాడు.

# బిఆర్ఎస్, బిజెపి ఎప్పుడూ కలవలేదు.. కలవవు

● కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ తోక పార్టీగా మారిందని పార్లమెంటులో రుజువైంది: బిజెపి ఎంపి లక్ష్మణ్



**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** బిఆర్ఎస్, బిజెపి ఎప్పుడూ కలవలేదు, కలవదు అని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్‌పై మండిపడ్డారు. సిఎం మూడ విశ్వాసాల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని, రాముడికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు ఇవ్వలేని సిఎం కెసిఆర్ మాత్రమే అన్నారు. భద్రాచలం వెళ్తే సిఎం పదవి ఊడిపోతుందని రాముడిని సైతం అవమానించే దుస్థితి ఉందన్నారు. ఊసరవెల్లి రంగు మార్చినట్లు కెసిఆర్ బిఆర్ఎస్ నుంచి బిఆర్ఎస్‌కు మార్చాడని, కానీ ఓటమి తప్పదన్నారు. ఎన్నికల యేడాది కాబట్టి రైతుల మీద ఎనలేని ప్రేమ కనబరుస్తున్నారన్నారు. కేంద్ర నిధులు నుంచి రూ.200 కోట్లు ప్రకటించి సొమ్ము ఒకరిది సోకరిది అన్నట్లుగా ఉంది. రైతులకు ఇస్తానన్న ఉచిత ఎరువులు ఏమయ్యాయి. డబుల్ బెడ్ రూం ఇండ్లు ఎనిమిది సంవత్సరాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. యూపిలో కోటి 75లక్షల ఇండ్లు కడితే తెలంగాణలో 26000 ఇండ్లు మాత్రమే కట్టారు. అందులో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలోనే కట్టారు. ఈనెల 8న రూ.20,000 కోట్ల పనులకు తెలంగాణలో శ్రీకారం చుడుతున్నారు. పల్లెల అభివృద్ధి కోసం నేరుగా కేంద్రం డబ్బులు ఇస్తున్నది, తెలంగాణలో మాత్రమే సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేదని రాష్ట్రాలు తెలంగాణ, ఏపి మాత్రమే, కెసిఆర్ కుటుంబ కలలు కల్లలు లాగానే మిగుల్తాయి. పెట్రోల్, డీజిల్ మీద కేంద్రం టాక్స్ తగ్గిస్తే మీ వాటా ఎందుకు తగ్గిస్తాలో కెసిఆర్? అన్నారు.పెట్రోల్, డీజిల్ జిఎస్‌టి పరిధిలోకి రాకుండా అడ్డుకున్నది హరీష్‌రావు అన్నారు. 30లక్షల కుటుంబాలు ఆందోళన చెందుతుంటే కెసిఆర్ రాష్ట్రాలు తిరుగుతున్నాడు, కానీ భరోసా ఇవ్వలేదన్నారు.టిఎస్‌పిఎస్‌సి చైర్మన్, విద్యాశాఖ మంత్రి, హోంమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కెటిఆర్ స్థాయి మరిచి మోడి మీద అవకులు చెవాకులు పేలుతున్నాడు. 2014 కంటే ముందు భారత్ ఇతర దేశాల సాయం కోసం వేచి చూసేది. ఇవ్వాల ప్రపంచ దేశాలు వారి సమస్య పరిష్కారం కోసం మోడి, భారత్‌వైపు చూస్తున్నారన్నారు. సిరిసిల్లా, తెలంగాణకు పరిమితం అయిన మీరు మాట్లాడతారా? అన్నారు. ప్రజలు ఇనినన సార్లు బుద్దిచెప్పినా ఇంకా మీకు కనువిప్పు జరగడం లేదన్నారు. మోడి కుటుంబసభ్యుల ఆస్తుల మీద మీద కెసిఆర్, కుటుంబ సభ్యుల ఆస్తుల మీద సిట్టింగ్ జడ్జితో విచారణ చేద్దామన్నారు. మేము మోడి సర్కార్ చేసినపనుల మీదనేఓట్లు అడుగుతున్నామని, మీకు మీ సర్కార్ చేసినపనులు చెప్పి ఓట్లు అడిగేదమ్ముందా అంటూ ప్రశ్నించారు.రాజ్యసభలో ప్రతి రోజు తెలంగాణాకు కెసిఆర్ చేసిన మోసాలు కేంద్రం ఇచ్చిన విధులు ప్రశ్నిస్తూనే ఉన్నానన్నారు. కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ తోకపార్టీగా మారిందని పార్లమెంటులో రుజువైందన్నారు. జాతీయపార్టీ గుజరాత్‌లో ఏమైంది, ఈ శాన్య రాష్ట్రాలలో ఎందుకు పోటీ చేయడంలేదు, కర్నాటకలో కుటుంబం పార్టీలైన కాంగ్రెస్, జెడిఎస్, బిఆర్ఎస్ కలుస్తాయన్నారు. పోస్టర్‌లకు ప్రజలకు సమాధానం ఇస్తారని, కాంగ్రెస్, టిఆర్ఎస్ కలిసి ప్రభుత్వం ఉన్నది నిజం అన్నారు.

# తెలంగాణలో పోలీసు పోస్టుల భర్తీకి 8, 9 తేదీల్లో తుది రాత పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో జరుగుతున్న కొలువుల భర్తీల్లో భాగంగా ఎస్ఐ తత్సమాన పోస్టులు, ఎఎస్ఐ పోస్టులకు సంబంధించిన తుదిరాత పరీక్షలు ఈ నెల 8, 9వ తేదీల్లో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లోని ఎంపిక చేసిన కేంద్రాల్లో జరగనున్నాయి.

ఈ మేరకు పోలీసు నియామక మండలి శనివారం ప్రకటన విడుదల చేసింది. ఎస్ఐ పోస్టులు.. సివిల్, సాయుధ బలగం, టిఎస్ఎస్‌పి, ఎస్‌పిఎఫ్, పోలీసు రవాణా, ఐటి, కమ్యూనికేషన్స్ తదితర విభాగాల్లోని ఖాళీల భర్తీకి పరీక్షలు జరగనున్నాయి. ఎఎస్ఐ పోస్టులు.. ఫింగర్ ప్రింట్ బ్యూరోలోని పోస్టుల భర్తీకి ఎనిమిది, తొమ్మిదో తేదీల్లో జరగనున్న పరీక్షలు రెండేసి పేపర్లకు జరగనున్నాయి.

కాగా తుది రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆరవ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు పోలీసు వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని నియామక మండలి తెలిపింది.



## జగనన్న ఆసరా కోటి 67 లక్షల చెక్కును లబ్ధిదారులకు అందజేసిన మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు

**భీమునిపట్నం (విశాఖపట్నం), ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** భీమిలి నియోజకవర్గం పరిధి సింహాచలంలో జగనన్న ఆసరా కార్యక్రమాన్ని ఈరోజు పుష్కరిణి సత్రంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు హాజరయ్యారు. ముందుగా సుమారు 2700 వందల మంది లబ్ధిదారాలకు చెక్కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని 23 సంక్షేమ పథకాలు ఈ రాష్ట్రంలో అమలు అవుతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళలకు నేరుగా ఖాతాలో జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు సమక్షంలో మహిళలు సంక్షేమ పథకాలు మహిళలకు ఏవిధంగా లబ్ధి చేకూరుతుందో వారి మాటల్లో తెలియజేశారు. 98వ వార్డు ఇన్‌చార్జ్ ఎర్రవరహ నరసింహ జన్మదిన సందర్భంగా మాజీ మంత్రి సమక్షంలో కేక్ కట్ చేసి మహిళలు శుభాకాంక్షలు తెలియజేశారు. దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎంఎంనాయుడు వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిలి ఇంచార్జ్ మహేష్, వార్డు నాయకులు లంక సత్తిబాబు, తురోతి రాము, సిరపరపు కృష్ణ, రామరాజు, మధు, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి కృష్ణాజిల్లాల అధ్యక్షుడు ఎన్.జగదీష్

## ఎస్సీఎస్టీలపై జరిగే హత్యలు, అన్యాయాలు అరికట్టాలి ఏపి ఎస్సీఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్

**విజయవాడ, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న హత్యలను అన్యాయాలను అరికట్టాలని ఏపి ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పట్టపు శీనయ్య, కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతయ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఎన్.జగదీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శేఖరరావు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ సాకా నాగమణి, డి.శ్రీనివాసరావు'లు మాట్లాడుతూ కడపలో పశు సంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డా.అచ్చన్నను హత్యచేసిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసి ఉరిశిక్ష విధించాలన్నారు. అలాగే అడక్వసీ జీవోను రద్దుచేసి, జలవనరుల శాఖలో ఎఫ్ఏసి'లను ఎత్తివేసి ప్రమోషన్లు ఇవ్వాలని, ఒకవేళ కోర్టు కేసులు ఏమైనా ఉంటే అడహక్ ప్రమోషన్లు ఇవ్వాలని, ఎఫ్ఏసి'లు ఇన్‌చార్జీలు ఎత్తివేయాలన్నారు. సిఎంవో నోట్ నెంబరు 31-03-2023ను విధిగా అమలు చేసి ఎఫ్ఎసి ఇన్‌చార్జ్‌లను ఎత్తివేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. జలవనరుల శాఖలో వేరే జోన్ 4,5,6 నుండి అక్కడి సర్వీస్ వదులుకుని జోన్-1లో పనిచేస్తున్న చివరి వ్యక్తికంటే దిగువ నియమింపబడిన 16మంది ఏఈఈలు, డిఈఈలు సొంతజోన్-1 ఏఈఈలు, డీఈల కంటే ముందే డిఈఈ, ఈఈ, ఎస్ఈ, సిఈలుగా ప్రమోషన్‌లు ఇచ్చారన్నారు. ఎస్సీ ఎస్టీల సమస్యలను పరిష్కరించడానికి సెక్రటేరియట్ ఎస్సీ, ఎస్టీలకు 5 మంది గెజిటెడ్ అధికారులతో ఒక లైజనింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పిహెచ్‌సి, విహెచ్‌సిలలో డెంటల్ సర్జన్‌ల పోస్టులను మంజూరు చేయాలని, ఇప్పటి వరకు పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను తీసివేయకుండా కొనసాగించాలన్నారు.



జనం మధ్య పరిటాల శ్రీరామ్‌తో కలసి నడుస్తున్న నారా లోకేష్

## యువనేత లోకేష్‌కు ధర్మవరంలో వినూత్న స్వాగతం

**ధర్మవరం టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర శనివారం ధర్మవరం నియోజకవర్గంలో ప్రవేశించింది. 57వ రోజుకు చేరిన ఈయాత్రకు ధర్మవరం సరిహద్దులో వినూత్నంగా స్వాగతం లభించింది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశేషంగా జనం తరలివచ్చి లోకేష్‌కు నీరాజనం పట్టారు. రాత్రి విడిది కేంద్రం నుండి ఆలస్యంగా ప్రారంభమైన పాదయాత్ర ధర్మవరం నియోజకవర్గ సరిహద్దుకు మధ్యాహ్నం 1 గంటకు చేరుకున్నారు. జనసంద్రంను తలపించిన ఈ ప్రాంతమంతా లోకేష్‌నుస్వాగతిస్తూ చేసిన కేరింతలు మిన్నంటాయి. విచిత్ర వేషధారణలు, యువగళం అని రాసిన పసుపురంగు బెలూన్లు, ఎన్‌టిఆర్, నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, పరిటాల రవీంద్ర, పరిటాల శ్రీరామ్‌ల మినీ కటౌట్లు, గురవయ్యలు, ఉరుముల సందడితో లోకేష్‌కు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, గజమాలలతో ఆహ్వానం పలికారు. మహిళలు పూర్ణకుంభాలతో పాటు, మంగళ హారతులతో స్వాగతించారు. పాదయాత్రకు ఎదురేగిన జనం ఆనందంతో తమ అభిమాన నాయకునికి అపూర్వ స్వాగతం పలికారు. గ్రామగ్రామాన జనం బాణసంచా కాల్చి ఆహ్వానం పలికారు. పట్టణంలో నారా లోకేష్‌ను స్వాగతిస్తూ వేసిన ఫ్లెక్సీల పరంపర కనిపించింది. కనీవినీ ఎరుగని రీతిన వచ్చిన జనాన్ని చూసిన నాయకులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనన్న ధీమా వ్యక్తం చేశారు. పెళ్ళుబికిన నూతన ఉత్సాహం వారిలో కనిపించింది.

**సమస్యలు తెలుసుకుంటూ బరోసా ఇచ్చిన నారా లోకేష్:** జనంతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి బరోసా కల్పిస్తూ సాగిన యువగళం పాదయాత్ర నారా లోకేష్ ఉన్నత భావాలకు అద్దంపడుతోంది. విడిది కేంద్రం నుండి ప్రారంభమైన పాదయాత్ర రాప్తాడు నియోజకవర్గంలోని నామాల క్రాస్, ప్యాదిండి గ్రామాల్లో స్థానికులతో లోకేష్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు,అవి ప్రజలకు అందుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే సమస్యల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దు తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడును ఆశీర్వదించాలని ఆయన కోరారు. టిడ్కో ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని విమర్శించారు. నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్ళను సెల్ఫీ తీసుకున్నారు.అనంతరం ఇందిరమ్మ కాలనీ వద్ద చేనేత కార్మికులతో మాటామంతి నిర్వహించారు.ఈ నాటి యాత్రలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన టిడిపి నాయకులతో పాటు అనంతపురం ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భావ సారుప్యత ఉన్న పార్టీలతో కలసి ముందడుగు వేస్తాం: ఏపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

**విజయవాడ, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** భావ సారూప్యత కలిగి కలిసి వచ్చే పార్టీలతో కాంగ్రెస్ పార్టీ కలిసి నడుస్తుందని ఏపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను బలమైన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు సమస్యలతో పోరాడుతూనే ఉంటుందన్నారు. గళమెత్తి కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపైన సస్పెన్షన్ వేటు వేశారని మోదీ ప్రభుత్వం పిరికిపంద ప్రభుత్వమన్నారు. ఏప్రిల్ నెలలో ప్రణాళికల ప్రకారం కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాలను వివరించారు. మాజీ పార్లమెంటు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా.కెవిపి రామచంద్రరావు మాట్లాడుతూ 20వేల కోట్లు షెల్ కంపెనీల ద్వారా ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పలేని కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా క్వార్టర్స్ ఖాళీ చేయమని ఆదేశాలివ్వడం ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నడూ జరగలేదని చింతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఖబడ్దార్ అంటూ హెచ్చరిస్తూ విచార ం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఏపిసిసి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపిసిసి కార్యదర్శులు మరియు ఏపి వ్యవహారాల బాధ్యులు సిడి మెయ్యప్పన్, ఎమ్.క్రిష్టోఫర్ తిలక్,ఏపిసిసి కార్యదర్శి జెడిశీలం, ఏపిసిసి మీడియా అండ్ సోషల్ మీడియా కమిటీ చైర్మన్ డా.ఎన్.తులసీరెడ్డి,ఏపిసిసికార్యనిర్వాహక అధ్యక్షులు, రాష్ట్ర,జిల్లా,నగరనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొహాలిమ్యాచ్‌కు వర్షం అంతరాయం

## డక్‌వర్త్‌లూయిస్ పద్ధతిలో పంజాబ్ జట్టు విజయం



**మొహాలి:** ఐపిఎల్‌సీజన్‌లో రెండో మ్యాచ్‌లో పంజాబ్‌కింగ్స్ బోణీ కొట్టింది. కోల్‌కత్తా నైట్‌రైడర్స్‌తోజరిగిన మ్యాచ్‌లో పంజాబ్ డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన కోల్‌కత్తా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లనష్టానికి 191 పరుగుల భారీ స్కోరుచేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో కోల్‌కత్తా తడబడింది. 16 ఓవర్లకు ఏడు వికెట్లు నష్టపోయి 146 పరుగులుచేసింది. తర్వాత భారీ వర్షం కురవడంతో ఆటను నిలిపి వేసారు. తిరిగి మ్యాచ్‌నిర్వహణ సాధ్యం కాకపోవడంతో డక్‌వర్త్‌లూయిస్ పద్ధతిలో పంజాబ్‌ను విజేతగా ప్రకటించారు.

192 పరుగుల లక్ష్యంతోబరిలోకి దిగిన కోల్‌కత్తాకు ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లోనే భారీ షాక్ తగిలింది. అర్షదీప్‌బౌలింగ్‌లో మన్‌దీప్‌సింగ్ రెండు, అనుకుల్‌రాయ్ నాలుగుపరుగులకే ఔట్ అయ్యారు. నిలకడగా ఆడుతున్న రెహ్మానుల్లా 22ను నాథన్ ఎల్లిస్ క్లీన్‌బౌల్డ్‌చేసాడు. ఆండ్రూ రస్సెల్ 19 బంతుల్లో 35 పరుగులుచేయగా వెంకటేశ్ అయ్యర్ 34పరుగులుచేసాడు. నితీష్‌రాణా 24 పరుగులతో స్కోరును ముందుకు నడిపారు. పంజాబ్‌బౌలర్లలో అర్షదీప్‌సింగ్ మూడు, సామ్‌కరన్, నాథన్ ఎల్లిస్, సికిందర్‌రజా, రాహుల్‌చాహర్‌లు తలో వికెట్ తీసారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌చేసినపంజాబ్ జట్టులో భానుక రాజపక్స 50 పరుగులుచేసాడు. 32 బంతుల్లో ఐదుఫోర్లు, రెండు సిక్స్‌లు కూడా రాబట్టాడు. శిఖర్‌ధావన్ 29 బంతుల్లో ఆరుఫోర్లతో 40 పరుగులుచేసి రాణించారు. జితేశ్‌శర్మ 21, ప్రభ్‌సిమ్రాన్‌సింగ్ 23 పరుగులతో పర్వాలేదనిపించారు. చివరిలో శామ్‌కరన్17 బంతుల్లో 26 పరుగులుచేసారు. షారూక్‌ఖాన్ 11పరుగులతో పర్వాలేదనిపించాడు. కోల్‌కత్తా బౌలర్లలో టిమ్‌సౌథీ రెండు వికెట్లు తీస్తే ఉమేష్‌యాదవ్, వరుణ్‌చక్రవర్తి, సునీల్‌నరైన్ తలో వికెట్‌తీసారు.



## కోహ్లీ రికార్డు సమంచేసిన గబ్బర్

**మొహాలి:** ఐపిఎల్ 16వసీజన్‌లో రెండో మ్యాచ్‌గా జరిగిన పంజాబ్‌కింగ్స్ వర్సస్ కెకెఆర్ మ్యాచ్‌లో పంజాబ్‌కింగ్స్ కెప్టెన్ శిఖర్‌ధావన్ ఆకట్టుకున్నాడు. 40 పరుగులతో ధావన్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. పంజాబ్ 191 పరుగుల భారీ స్కోరుచేయడంలో తన వంతుపాత్రపోషించాడు. భానుక రాజపక్సతో కలిసి రెండో వికెట్‌కు 86 పరుగులు జోడించాడు. ఈనేపథ్యంలో శిఖర్‌ధావన్ తన పేరిట అరుదైన రికార్డును లిఖించుకున్నాడు. ఐపిఎల్ చరిత్రలో అత్యధికసార్లు 50 ప్లస్ భాగస్వామ్యాలుసాధించిన క్రికెటర్‌గా ధావన్‌నిలిచాడు. ఐపిఎల్‌లో ధావన్‌కు ఇది 94వ అర్థశతకం భాగస్వామ్యం. ఈ క్రమంలో కోహ్లీరికార్డును ధావన్ సమంచేసాడు. ఆర్సీబీ తరపున కోహ్లీకూడా 94 అర్థశతక భాగస్వామ్యాలు అందించాడు. ఇక అత్యధిక 50 ప్లస్ భాగస్వామ్యాయలలో ఈ ఇద్దరు తొలిరెండు స్థానాల్లో ఉంటే మూడోస్థానంలో సురేష్‌రైనా 83 అర్థశతక భాగస్వామ్యాలు తెచ్చాడు. డేవిడ్‌వార్నర్ 82.50ప్లస్ భాగస్వామ్యంతో నాలుగోస్థానంలో ఉన్నాడు. ఇక 29 బంతుల్లో 40 పరుగులుచేసి ధావన్ ఇన్నింగ్స్‌లో ఆరుఫోర్లున్నాయి.

## ఇంపాక్ట్ ప్లేయర్‌పై అవగాహన నిల్!



**మొహాలి:** ఐపిఎల్ సీజన్‌నుంచే బిసిసిఐ కొత్తగాప్రవేశపెట్టిన ఇంపాక్ట్‌ప్లేయర్‌నిబంధనను అర్థంచేసుకోవడంలో రెండు జట్లు విఫలం అయ్యాయి. మొహాలి మ్యాచ్‌లో కోల్‌కత్తా నైట్‌రైడర్స్, పంజాబ్‌కింగ్స్ జట్లకు ఈ నిబంధన అర్థంకాలేదు. ఈ మ్యాచ్‌లో ఆడే ప్లేయింగ్ 11తో పాటు ఐదుగురు ప్రత్యామ్నాయ ప్లేయర్ల జాబితానుకూడా రెండుజట్ల కెప్టెన్లు అందచేసారు. ఇక్కడే పంజాబ్, కోల్‌కత్తా జట్లు తప్పు చేసాయి. ఇంపాక్ట్‌ప్లేయర్ పేరు కచ్చితంగా ఈ జాబితాలో ఉండాలి. విదేశీ ప్లేయర్‌ఉన్నా ఆతడిని ఇంపాక్ట్‌ప్లేయర్‌గా తీసుకునే వీల్లేదు. ఈ విషయం మరిచిన కోల్‌కత్తా,పంజాబ్‌జట్లు ప్లేయింగ్ 11లో నలుగురు విదేశీ ప్లేయర్లను తీసుకున్నప్పటికీ ఐదుర జాబితాలో ఓ విదేశీ ప్లేయర్‌ను చేర్చాయి. దాంతో ఇరుజట్లు ఆ విదేశీ ప్లేయర్‌నే ఇంపాక్ట్‌గా తీసుకోడానికి ఛాన్స్‌లేకుండా పోయింది. కోల్‌కత్తా తుదిజట్టులోకి రహ్మతుల్లా గుర్బాజ్, ఆండ్రీ రసెల్, సునీల్‌ణరైన్, టిమ్‌సౌథీ రూపంలో విదేశీ ప్లేయర్లున్నారు. అయినా ఇంపాక్ట్‌ప్లేయర్‌గా తీసుకునే ఛాన్స్ లిస్టులో డేవిడ్ వైస్‌ని చేర్చింది. అలాగే పంజాబ్‌జట్టు కూడా భానుక రాజపక్సె, సికందర్‌రజా, శామ్‌కరన్; నాథన్ ఎలిస్ రూపంలో నలుగురు విదేశీ ప్లేయర్లకు చోటిచ్చింది. అలాగే ఐదుగురు సబ్‌స్టిట్యూట్ జాబితాలో మాథ్యూ షార్ట్‌నిచేర్చింది. దాంతో డేవిడ్‌వైస్, మాథ్యూషార్ట్‌ను ఇంపాక్ట్‌ప్లేయర్‌గా తీసుకునే ఛాన్స్ రెండుజట్లు కోల్పోయాయి. ఇంపాక్ట్‌ప్లేయర్ రూపంలో విదేశీ ఆటగాడి స్థానంలోమరో విదేశీ క్రికెటర్‌ను తీసుకోడానికి వీల్లేదు. ఇకవేళ తీసుకుంటే అప్పుడు ఐదుగురు విదేశీ ప్లేయర్లని ఆడించినట్లు అవుతుంది. ఇది ఐపిఎల్ బేసిక్‌రూల్‌కు విరుద్ధం.



## 15 యేళ్లనాటి దూకుడు ఇప్పుడు ఉంటుందా?

### ధోనీ పట్ల విషప్రచారం అన్న కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్

**ముంబయి:** ఐపిఎల్ సీజన్‌ను చెన్నై ఓటమితో షురూచేసింది. మ్యాచ్‌లో కెప్టెన్‌ధోనీ బ్యాటింగ్‌లో దూకుడుగా ఉన్నప్పటికీ కీపింగ్‌లో గతంలో వేగం కొంత తగ్గిందన్న ప్రచారం వెలుగులోకి రావడంతో సీఎస్కేకోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పందించాడు. 15 ఏళ్లకిందట ఉన్న సత్తా ఇప్పటికీ కొనసాగదు కదా అంటూ ధోనీ నిరంతరం ఆడుతూనే ఉంటాడు. అయితే ఆతడిలో వేగం లేదనే వార్తలు ఎక్కడినుంచి వస్తున్నాయో అర్థం కావడంలేదు 15 ఏళ్లకిందట ఉన్న దూకుడు ఇప్పుడు ఎలా ఉంటుందని ప్రశ్నించాడు. ఈసీజన్‌ప్రారంభానికి ముందు వరకూ మోకాలి నొప్పితో భాధపడ్డాడు. కానీ ఈ మ్యాచ్‌లో కాలు తిమ్మిరి ఎక్కింది. మోకాలు నొప్పికాదు. ఆతడు 15 ఏళ్లకిందట ఎంత వేగంగా ఉన్నాడో ఇప్పుడు కూడా అలాగే ఉండడం కష్టమే. అయితే ఇప్పటికీ ధోనీ గొప్ప లీడర్, బ్యాటింగ్‌లో తన దూకుడు చూపించాడు. తనపరిస్థితిపై ఆతడికి ఒక అవగాహన ఉంటుంది. మైదానంలో చాలా కీలకమైన ఆటగాడు. అతడొక దిగ్గజ క్రికెటర్ కాదని ఎవరైనా చెప్పగలరా అని ఫ్లెమింగ్ ఎదురుప్రశ్నలువేసాడు.

## గుజరాత్ టైటాన్స్‌కు భారీ షాక్

### గాయంతో కేన్‌విలియమ్సన్ దూరం



**అహ్మదాబాద్:** ఐపిఎల్ 2023 సీజన్ తొలిమ్యాచ్‌లోనే గుజరాత్ టైటాన్స్‌కు భారీ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్‌కేన్ విలియమ్సన్ మోకాలిగాయం కారణంగా టోర్నీనుంచి వైదొలిగాడు. చెన్నై సూపర్‌కింగ్స్‌తోజరిగిన తొలిమ్యాచ్‌లో ఫీల్డింగ్‌చేస్తున్న సమయంలో కేన్ గాయపడ్డాడు. ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో రుతురాజ్ గైక్వాడ్ సిక్స్ కొట్టేందుకు యత్నించాడు. అమాంతం గాల్లోకి ఎగిరి క్యాచ్ అందుకునే యత్నంచేసిన విలియమ్సన్ బౌండరీ బయట పడిపోయాడు. కానీ ఈలోపే బంతిని మైదానంలోకి విసిరి రెండుపరుగులు సేవ్‌చేసాడు. కిందపడే సమయంలోకేన్ మోకాలు నేలకు బలంగా తాకింది. దీనితో విలియమ్సన్ నొప్పితో విలవిల్లాడాడు. సహాయకసిబ్బంది సాయంతో విలియమ్సన్ మైదానం వదిలి వెళ్లగా సాయిసుదర్శన్‌ను ఇంపాక్ట్‌ప్లేయర్‌గా బరిలోకి దించారు. విలియమ్సన్ బ్యాటింగ్‌కు రానిలోటు ఛేజింగ్‌లో స్పష్టంగా కనిపించింది. గాయపడిన విలియమ్సన్‌ను స్కానింగ్‌కోసం ఆసుపత్రికి తరలించాడు. కేన్‌కు మోకాలి గాయం అయిందన్న కెప్టెన్ పాండ్యా స్కానింగ్ రిపోర్టులు వైద్యులుపరిశీలించాకే స్పష్టత వస్తుందన్నాడు. కానీ ఆతడు ఐపిఎల్‌మొత్తానికి దూరం అవుతున్నట్లు తేలింది. ఐపిఎల్ వేలంలో టైటాన్స్ ఆతడిని రెండుకోట్ల ప్రాథమిక ధరకు కొనుగోలుచేసింది. 2015లో సన్‌రైజర్స్‌లో చేరిన కేన్‌విలియమ్సన్ గత సీజన్‌వరకూ ఆ ఫ్రాంచైజీ తరపునే ఆడాడు. గత సీజన్‌లో ఆటతీరు నిరాశపరిచింది. దీనితో ఆరెంజ్ ఆర్మీ ఆతడిని వేలానికి వదిలేసింది. ఆతడిస్థానం డేవిడ్ మిల్లర్‌తో భర్తీచేసే అవకాశం ఉంది. నెదర్లాండ్స్‌తో దక్షిణాఫ్రికా మ్యాచ్‌వల్ల ఐపిఎల్ తొలిమ్యాచ్‌లో మిల్లర్ ఆడలేకపోయాడు. తర్వాతమ్యాచ్‌లకు అందుబాటులోకి వస్తాడు.

## మలేసియా ట్రేడింగ్‌లోనూ భారత్ రూపాయి!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** అంతర్జాతీయ వాణిజ్యంలో దేశీయ కరెన్సీ రూపాయికి ఆదరణ పెరుగుతోంది. భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూపాయల్లో చేయడానికి చాలా దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే రష్యా మారిషస్, శ్రీలంకలతో ఎగుమతి-దిగుమతి లావాదేవీలు రూపాయల్లో చేస్తుండగా, తాజాగా ఈ జాబితాలో మలేసియా కూడా చేరింది. ఇక భారత్, మలేసియా మధ్య ట్రేడ్ సెటిల్‌మెంట్‌లు ఇతర కరెన్సీలతో పాటు రూపాయాల్లోనూ జరుగుతాయని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ చెల్లింపులను రూపాయల్లో చేసేందుకు వీలుగా గతేడాది జులైలో ఆర్‌బిఐ అనుమతులిచ్చింది. అందుకు అనుగుణంగా ఇప్పుడు మలేసియాతో వాణిజ్యం ప్రస్తుతమున్న కరెన్సీలతో పాటు రూపాయల్లోనూ జరగనుంది. ఇందుకోసం కౌలాలంపూర్‌లోని ఇండియా ఇంటర్నేషనల్ బ్యాంకు ఆఫ్ మలేసియా, భారత్‌లోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో కలిసి ప్రత్యేక రూపీ వోస్ట్రో ఖాతాలను అందుబాటులోకి తెచ్చింది అని విదేశాంగ శాఖ వెల్లడించింది. దీంతో ఇరు దేశాల మధ్య ఇకపై ఎగుమతులు, దిగుమతుల ఇన్‌వాయిసింగ్, చెల్లింపులు, సెటిల్‌మెంట్ మన రూపాయాల్లోనూ జరగనున్నాయి. దేశీయ కరెన్సీలో క్రాస్-బోర్డర్ వాణిజ్య లావాదేవీలకు సంబంధించిన సవివర మార్గదర్శకాలను ఆర్‌బిఐ గతేడాది జులైలో జారీచేసిన విషయం విదితమే. రూపాయల్లో వాణిజ్య లావాదేవీల సెటిల్‌మెంట్ కోసం, భాగస్వామి వాణిజ్య దేశానికి చెందిన బ్యాంకుల్లో రూపీ వోస్ట్రో ఖాతాలతో ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తారు. దేశీయ దిగుమతిదార్లు ఈ వ్యవస్థ ద్వారా చేసుకునే దిగుమతుల కోసం, వోస్ట్రో ఖాతాలకు రూపాయల్లో చెల్లింపు చేస్తారు. ఎగుమతిదార్లు విదేశాలకు ఎగుమతి చేసిన వస్తువులు, సేవలకు కూడా ఈ వ్యవస్థలో వోస్ట్రో ఖాతాల నుంచి రూపాయల్లోనే నిధులు అందుకుంటారు.



## వాణిజ్యం

## మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు మరోసారి ఉద్వాసన

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** టెక్ కంపెనీల తొలగింపులు కొనసాగుతున్నాయి. ఆర్థిక సంక్షోభం కారణంగా చాలా ఐటి కంపెనీలు తమ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఎక్కువగా మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులను తొలగించింది. మైక్రోసాఫ్ట్ బెల్లేవ్, రెడ్‌మండ్‌లో 559 మంది ఉద్యోగులను తొలగించింది. దీనితో పాటు మైక్రోసాఫ్ట్ సీటెల్‌ప్రాంతంలో కంపెనీ నుంచి మొత్తం 2,743 ఉద్యోగులను తొలగించింది. ఈ యేడాది ప్రారంభంలో దిగ్గజ ఐటి కంపెనీలు చేసిన అతిపెద్ద ప్రకటనఇదే. ఇదిగతంలో తన కంపెనీలలో 10వేల మందిని పావు వంతు కంటే ఎక్కువ మందిని తొలగించింది. వాషింగ్టన్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ సెక్యూరిటీలో తాజా తొలగింపులు అధికారికంగా ప్రకటించబడ్డాయి. మైక్రోసాఫ్ట్ సెక్యూరిటీఆపరేషన్స్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఈ ఉద్యోగాల కోత విధించినట్లు ఒక నివేదిక నివేదించింది. ఫిబ్రవరిలో మైక్రోసాఫ్ట్ తన మొదటిరౌండ్ ఉద్యోగులనుతొలగించింది. ఇందులో రెడ్‌మండ్, బెల్లేవ్, ఇస్సాక్వాలో 617 మంది ఉద్యోగులను తొలగించినట్లు నివేదించింది. 2021లో మైక్రోసాఫ్ట్‌లో చేరిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ మాజీ ఎగ్జిక్యూటివ్ చార్లీ బెల్ ఆధ్వర్యంలో వందలాది మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలిపింది.

## ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకులో వాట్సాప్ సేవలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ప్రైవేట్ టెలికం దిగ్గజం ఎయిర్‌టెల్‌తో కలిసి బ్యాంకింగ్ సేవలను ప్రారంభించింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు వినియోగదారులు స్మార్ట్‌ఫోన్‌లో వాట్సాప్ బ్యాంకింగ్ సేవలు పొందవచ్చు. పలు బ్యాంకు సర్వీసులతో పాటు ఇంటి వద్ద సేవల కోసం వినతి, సమీపంలోని పోస్ట్ ఆఫీస్ శాఖ ఎక్కడ ఉంది వంటివి వాట్సాప్ ద్వారా ఖాతాదారులు తెలుసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు. భారత్‌లో డిజిటల్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌ను ప్రోత్సహించడానికి భారతీ ఎయిర్ టెల్‌తో భాగస్వామ్యం కావడానికి సంతోషిస్తున్నామని ఇండియాపోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపిపిబి) సిజిఎం అండ్ సిఎస్‌ఎంఒ, గురుశరణ్ రాయ్ బన్సాల్ చెప్పారు. డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగస్వామిగా దేశంలోని గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలను అందించడానికి ఐపిపిబి చాలా కాలంగా అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. సాంతికతతో నడిచే ఆర్థిక రంగంలో అపారమైన అవకాశం ఉందని ఎయిర్ టెల్ ఐక్యూ బిజినెస్ హెడ్ అభిషేక్ బిస్వాల్ అన్నారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు అత్యుత్తమ ఆర్థిక ఉత్పత్తులను తీసుకెళ్తామని చెప్పారు. ఎయిర్‌టెల్ ఐక్యూ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు కస్టమర్లు బలమైన, సులభమైన, సురక్షిత క్లౌడ్ కమ్యూనికేషన్ అందిస్తుందని చెప్పారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకునకు 4.51 లక్షల పైచిలుకు కస్టమర్లు ఉన్నారు. లైఫ్ ఇంటెరాక్టివ్ కస్టమర్ సపోర్ట్‌ఏజెంట్‌ను కూడా వాట్సాప్‌లో పరిచయం చేయనున్నారు.




## రూ.5.86 లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సంపద ఆవిరి!

**ముంబై, ఏప్రిల్ 1:** అధిక ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ సమస్యలు, అధిక వడ్డీ రేట్ల వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య 2022-23 ఆర్థిక సంవత్సరంలో స్టాక్‌మార్కెట్ల ఇన్వెస్టర్లు రూ.5.86 లక్షల కోట్లను కోల్పోయారు. మార్చి 31తో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడదారులు అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అధిక వడ్డీరేట్లు, విదేశీ నిధులు వెనక్కి వెళ్లిపోవడం, ఇటీవల ప్రపంచ బ్యాంకింగ్ రంగం సంక్షోభం వంటి అంశాలు ఎక్కువ ఒత్తిడి కలిగించాయి. దాంతో గత ఆర్థిక సంవత్సరంలో బిఎస్‌ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.5.86 లక్షల కోట్లు తగ్గి రూ.258 లక్షల కోట్లకు పడిపోయింది. ద్రవ్యోల్బణం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక సెంట్రల్ బ్యాంకులు కీలక రేట్లను పెంచాయి. దాంతో పాటు మాంద్యం, ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై ఆందోళనతో మార్కెట్లను బలహీనపరిచాయని ట్రేడింగ్ వ్యవస్థాపకుడు పార్థ్‌న్యాతి అన్నారు. 2022-23లో బిఎస్‌ఇ సెన్సెక్స్ అంతకుముందు ఆర్థిక సంవత్సరం నుంచి 423.01 పాయింట్లు లేదా 0.72శాతం పెరిగింది. ముఖ్యంగా మార్చి 31తో ముగిసిన చివరి రోజు సెన్సెక్స్ 1,031,43 పాయింట్లు పెరగడం విశేషం. గతేడాది డిసెంబరు 14 ఇన్వెస్టర్ల సంపదగా భావించే బిఎస్ఇ మార్కెట్ విలువ రికార్డుస్థాయిలో రూ.291.25 లక్షల కోట్లను చేరింది. అలాగే 2022 జూన్ 17న సెన్సెక్స్ యేడాది కనిష్టం 50,921.22ని నమోదు చేసింది. అదేవిధంగా 2022 డిసెంబరు 1న ఆల్‌టైమ్ గరిష్టం 63,583.07కి చేరింది. రూ.15.77 లక్షల కోట్లతో రిలయన్స్ దేశంలోనే అత్యంత విలువైన సంస్థగా ఉంది. తర్వాత టిసిఎస్ రూ.11.73 లక్షల కోట్లు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు రూ.8.98లక్షలకోట్లు, ఐసిఐసిఐబ్యాంకు 5.62 లక్షల కోట్లు, హిందుస్థాన్ యూనిలీవర్ రూ.6.01 లక్షల కోట్లతో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.



## విదేశీ ఇన్వెస్టర్లలో బేరిష్ ధోరణులు




**ముంబై, ఏప్రిల్ 1:** విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత మార్కెట్ల పట్ల తీవ్ర బేరిష్ ధోరణిని ప్రదర్శిస్తున్నారు. దీనికి నిదర్శనంగా గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత నికర షార్ట్ పొజిషన్లను వారు కొనసాగిస్తున్నారు. యుఎస్ ఫెడ్ అదే పనిగా వడ్డీరేట్లు పెంచుతూ వెళుతుండడం, దీంతో అమెరికాలో బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడం, పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, తాజాగా తోడైన అమెరికా బ్యాంకింగ్ సంక్షోభం, ఇవన్నీ కలిసి ప్రతికూల ధోరణిని బలోపేతం చేస్తున్నాయి. ఈ పరిణామాల ఫలితంగా విదేశీ ఇన్వెస్టర్లు కొన్ని నెలలుగా భారత మార్కెట్లపై ప్రతికూల వైఖరితోనే కొనసాగుతున్నారు. భారత ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు సాగిస్తూనే ఉన్నారు. అదే సమయంలో మన దేశీయ మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు, బీమా సంస్థలు, ఇతర ఇనిస్టిట్యూషన్స్, హెచ్ఎన్ఐలు కొనుగోళ్లు చేస్తుండడం మార్కెట్లు భారీగా పడిపోకుండా ఆదుకుంటోంది. నిఫ్టీ ఇండెక్స్ ఫ్యూచర్లలో ఎఫ్‌పిఐల ఓపెన్ షార్ట్ కాంట్రాక్టులు 2,16,000కు పెరిగాయి. కానీ గత ఐదేళ్లలో సగటున ఈ షార్ట్ కాంట్రాక్టులు లక్షగానే ఉండేవి. దాంతో పోలిస్తే రెట్టింపైనట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లలో నెట్‌షార్ట్ పొజిషన్లు 2,00,000 కాంట్రాక్టులను దాటిపోయింది. కేవలం 6శాతం ట్రేడింగ్ రోజుల్లోనే నమోదైంది. నికర షార్ట్ పొజిషన్లు పెరగడం అనేది సమీప కాలానికి మార్కెట్ల పట్ల ఎఫ్‌పిఐలు బేరిష్ వైఖరితో ఉన్నారని తెలియచేస్తోందని, ఇక్కడి నుంచి మార్కెట్లు పడిపోతాయనే అంచనాతో ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఇండెక్స్ ఫ్యూచర్, ఆప్షన్లలో షార్ట్ చేసి, పడిపోయిన తర్వాత కొనుగోలు చేయడం వల్ల లాభాలు సమకూరతాయి.

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** కేంద్ర ప్రభుత్వం ప్రజలుకు కొత్త 2023-24 ఆర్థిక సంవత్సరంలో గుడ్‌న్యూస్ అందించింది. చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను 70 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ పెంపు 2023, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వర్తిస్తుంది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌కు అధికంగా 8.2శాతం, మంత్లీ ఇన్‌కమ్ సేవింగ్స్ స్కీమ్‌కు 7.4శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్‌కు 7.7శాతం, కిసాన్ వికాస్ పత్రకు 7.5 శాతం, సుకన్య

## స్మాల్ సేవింగ్స్‌పై వడ్డీరేట్ల పెంపు

సమృద్ధి యోజన పథకానికి 8శాతం వడ్డీ అమలవుతుంది.

మంత్లీ ఇన్‌కమ్ సేవింగ్స్‌స్కీమ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్, కిసాన్ వికాస్‌పత్ర, అన్ని పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్లు, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై వడ్డీరేట్లు పెరిగాయి. గత 9 నెలల్లో చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను కేంద్రం పెంచడం ఇది మూడోసారి. ప్రస్తుతం వీటి వడ్డీరేట్లు 4శాతం నుంచి 8.2శాతం మధ్య ఉన్నాయి. అయితే పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతా, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌ల వడ్డీరేటులో ఎటువంటి మార్పు లేదు. అదే యేడాది పోస్ట్ ఆఫీస్ టైమ్ డిపాజిట్‌పై వడ్డీరేటును 6.6 శాతం నుంచి 6.8శాతానికి, 2యేళ్ల పోస్ట్ ఆఫీస్ టైమ్ డిపాజిట్‌పై వడ్డీని 6.8శాతం నుంచి 6.9శాతం శాతానికి పెంచారు. మూడేళ్లకు 7శాతం, ఐదేళ్లకు 7.5శాతం, 5యేళ్ల రికరింగ్ డిపాజిట్‌కు 6.2 శాతం, సీనియర్




కాగా ప్రభుత్వం త్రైమాసిక ప్రాతిపదికన చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను సవరిస్తుందనే విషయం విదితమే.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at E-29,30,31,Industrial Estate, A.K.Nagar, Nellore-524 004 . Ph: 2348108 Fax: 2348106, Editor :* Damerla Sai Baba,*Responsible for selection of news under the PRB Act,RNI NO: APTEL/2003/10109,Postal Licence no.PLG/RNP/36/12-14.